

మీ కనెక్షన్.. మీ ఏజెన్సీ!

● నచ్చిన డీలర్‌కు గ్యాస్ సర్వీసు మార్చుకునే అవకాశం



గ్యాస్ సంస్థ	కనెక్షన్లు
హెచ్‌పీసీఎల్	2,38,927
బీపీసీఎల్	1,99,831
ఐఓసీఎల్	3,48,725
మొత్తం	7,87,483

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ కనెక్షన్‌లోనూ పోర్టబిలిటీ విధానం అమలులోకి రానుంది. ఈ విధానంలో ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడ రేషన్ సరుకులు తీసుకోవచ్చు. అలాగే గ్యాస్ కంపెనీ సేవలు నచ్చకపోతే మరో కంపెనీకి మారే అవకాశాన్ని త్వరలో ప్రభుత్వం కల్పించనుంది. గ్యాస్ సిలిండర్ ధర ఒక్కటే కావటంతో పోర్టబిలిటీ విధానానికి ఇంధన నియంత్రణ సంస్థ సంకల్పించింది. వినియోగదారులకు ఈ విధానం ఉపయుక్తం కానుంది. ఒకే కంపెనీ పరిధిలో డీలరును మార్చుకునే వెసులుబాటును 2013లోనే కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం గ్యాస్ కంపెనీనే మార్చుకునే అవకాశం కల్పిస్తోందనీ, త్వరలో ఈ విధానం అమలులోకి వస్తుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పారు. కాగా, జిల్లాలో 78,74,83 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, మూడు ప్రధాన కంపెనీలకు 52 ఏజెన్సీలు ఉన్నాయి.

కూలి తీసుకుని.. గుట్టుగా జారుకుని!

● 'ఉపాధి' పథకంలో అక్రమాలకు బ్రేక్
● ఈకేవైసీ తప్పనిసరి చేసిన కేంద్రం
● 4,90,910 మందికి 73.54 శాతం పూర్తి
● ప్రక్రియకు దూరంగా 1,31,718 మంది
● అక్రమాలు బయటపడతాయనే..

వివరాలు 8లో..



గతంకన్నా రెట్టింపు సాయం

● సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి
● మత్స్యకారులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపు
● ఉత్సాహంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

వివరాలు 8లో..



మత్స్యకారులకు పడవ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద, అజీజ్ తదితరులు

ఆ ఇళ్లు పనికిరావ్!

పేదల ఇళ్ల మాటున జరిగిన అవినీతి, అక్రమాలు సాక్షాలతో సహా బయటపడుతున్నాయి. ఇప్పటికే విజిలెన్స్, హౌసింగ్ శాఖ అంతర్గత విచారణలోనూ భారీగా అవినీతి జరిగినట్లు తేలగా, తాజాగా థర్డ్ పార్టీ విచారణలోనూ భారీ కుంభకోణం జరిగినట్లు వెలుగు చూస్తోంది. ఎమ్మెల్యేల మొదలు సామాన్యుల వరకూ ఫిర్యాదులు అందుతుండటంతో గత ప్రభుత్వంలో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్ల నాణ్యతను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పనిని ఓ థర్డ్ పార్టీ ఏజెన్సీకు అప్పగించింది. గడిచిన మూడు వారాలుగా పేదల లేఅవుట్లలో నిర్మించిన ఇళ్ల నాణ్యతను ఈ థర్డ్ పార్టీ ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. 20 వేలకుపైగా ఇళ్లను పరిశీలించాల్సి ఉండగా ఇప్పటివరకూ 14 వేల ఇళ్ల పరిశీలన పూర్తయినట్లు తెలుస్తోంది.



టీపీ గూడూరు మండలం వరిగొండ గ్రామం ఎస్టీ కాలనీలోని ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న థర్డ్ పార్టీ ఇంజనీర్లు

● కొన్నింటిని తొలగించి పునఃనిర్మించాల్సిందే!
● మరికొన్నింటి నిర్మాణాలను సరిచేయాలి
● థర్డ్ పార్టీ నిర్ధారణలో తేలుతున్న ఇళ్ల నాణ్యత
● కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారుల దోపిడీ ఫలితం
● తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ఎత్తుగడలు

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పరిశీలించిన 14 వేల ఇళ్లల్లో సుమారు 5 వేల ఇళ్లు నాసిరకంగా నిర్మించారని థర్డ్ పార్టీ నిర్ధారించినట్లు సమాచారం. ఇందులో కొన్ని ఇళ్లను టెక్నాలజీ ఉపయోగించి సరిచేసుకునేందుకు అవకాశం ఉందని, మరికొన్నింటిని పూర్తిగా నేలమట్టం చేసి మళ్లీ నిర్మించాలని సూచించినట్లు తెలుస్తోంది. తొమ్మిది పిల్లర్లతో ఇళ్లు నిర్మించాల్సి ఉండగా, కొన్నిచోట్ల నాలుగు పిల్లర్లు మాత్రమే వేసి ఉన్నారు. పిల్లర్ లోతు ఆరు అడుగులు ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల మూడు అడుగులకు మించి లేదని గుర్తించారు. ఇక సిమెంటు, స్టీలు వాడకం కూడా తక్కువగా ఉందని, ఇటువంటి ఇళ్లు ఎక్కువ కాలం నిలవవని థర్డ్ పార్టీ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు హౌసింగ్ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రం వ్యాప్తంగా జరుగుతున్న క్వాలిటీ పరీక్షల్లో ఎక్కువ అక్రమాలు నెల్లూరు జిల్లాలో బయటపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు, కాంట్రాక్టర్లు థర్డ్ పార్టీను కూడా మేనేజ్ చేసే పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ ఇళ్లు బాగున్నాయని నివేదిక ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, కావలి డివిజన్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో హౌసింగ్ ఎండీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌బాబు జిల్లాపై దృష్టి సారించారు. ఈ క్వాలిటీ పరీక్షలను పరిశీలించేందుకు శుక్రవారం నెల్లూరుకు వచ్చేందుకు షెడ్యూల్ ఖరారు చేయగా, చివరి నిమిషంలో వాయిదా పడింది. వచ్చే వారం ఆయన జిల్లాకు వచ్చే అవకాశముందని హౌసింగ్ వర్గాలు చెబుతున్నాయి.

● తప్పించుకునేందుకు ఎత్తుగడలు

గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల మాటున కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఆప్షన్-3 పేరుతో ఇష్టానుసారం కాంట్రాక్టర్లకు ఇళ్లను అప్పగించగా, అత్యంత నాసిరకంగా నిర్మించారు. మాకు పోయేదేముందిలే.. అన్న ధోరణిలో అధికారులు వారితో కుమ్మక్కయ్యారు. ఇళ్లు నిర్మించకపోయినా బిల్లులు చెల్లించే బరితెగింపు చర్యలకు జిల్లాలో హౌసింగ్ అధికారులు పాల్పడ్డారు. విజిలెన్స్ విచారణలో ఈ కుంభకోణం బయటపడింది. ఇప్పుడు ఇళ్ల నాణ్యత కూడా అత్యంత నాసిరకంగా ఉందని తేలుతుండడం నాడు జరిగిన దోపిడీ స్థాయిని ఎత్తి చూపుతోంది. అయితే ఈ ప్రభుత్వంలో కూడా గత అక్రమాలను అధికారులు తొక్కిపెట్టి ఇటీవల వరకూ బిల్లులు పాస్ చేయడం గమనార్హం. పేదల ఇళ్ల విషయంలో అక్రమాలకు పాల్పడ్డ అనేక మంది హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో కాంట్రాక్టర్ల చేత పనులు చేయించడమా లేదా రికవరీ చేయడమా అన్నది కూడా ప్రభుత్వ స్థాయిలో ఆలోచన జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు, అధికారులు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎలాగైనా బయటపడాలని తమ బలాన్నంతా ఉపయోగిస్తున్నారు.



నెల్లూరు మేయర్‌పై

అవిశ్వాసానికి వేళాయె!

● నేటితో నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి
● వేగంగా అడుగులు వేస్తున్న కార్పొరేటర్లు
● సోమవారం నోటీసులు ఇచ్చే అవకాశం?

నెల్లూరు (సిటీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్‌గా పొట్లూరి స్రవంతి బాధ్యతలు స్వీకరించి శనివారానికి నాలుగేళ్లు పూర్తికానుంది. దీంతో ఆమెపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న కార్పొరేటర్లు కలెక్టర్, ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లాకు నోటీసు అందచేసేందుకు ముమ్మరంగా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. శనివారానికి నాలుగేళ్లు పదవీ కాలం పూర్తి చేసుకున్న ఆమె ఆ మరుసటి రోజు ఆదివారం కావడంతో సోమవారం కార్పోరేటర్లంతా లిఖిత పూర్వక అవిశ్వాస నోటీసును అందచేయనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం చర్చ మొదలైంది. ఎస్టీ జనరల్ కింద స్రవంతి నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్నారు. ఆమెపై అవిశ్వాసం పెడితే అధికార టీడీపీకే అత్యధిక కార్పొరేట్ స్థానాలు ఉండటంతో సులువుగా ఆమెను ఆ పదవి నుంచి దించే అవకాశాలున్నాయి. ఆ తరువాత ఆ స్థానంలో మేయర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్నది అధికార పార్టీలో ఆసక్తిగా మారింది. ఈ విషయమై అటు మంత్రి నారాయణ, ఇటు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు లోతైన అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే డిప్యూటీ మేయర్లలో ఒకరికి ఇన్‌చార్జి మేయర్‌గా అవకాశం కల్పిస్తారన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

పొట్టేపాళెం వంతెన నిర్మాణానికి

టెక్నికల్ అనుమతులు

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ శుక్రవారం టెక్నికల్ అనుమతులు మంజూరు చేసింది. సోమవారం నుంచి టెండర్లు ఆహ్వానించేలా జిల్లా అధికారులకు అనుమతి ఇచ్చింది. రూ.4 కోట్లతో బ్రిడ్జి పనులు మొదు కానున్నాయి. ఏడాదిలోపు పనులు పూర్తి చేసేలా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. నెల్లూరు-తాటిపర్తిరోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం గత నెలలో పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అయితే ఆ ఉత్తర్వులలో రోడ్డు అభివృద్ధి అన్నారు తప్ప బ్రిడ్జి నిర్మాణం గురించి ప్రస్తావించలేదు. దీంతో పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణంపై సందిగ్ధం నెలకొంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బ్రిడ్జి నిర్మాణానికి టెక్నికల్ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



ఆశ చూపి.. నిలువునా దోచేసి..!

బ్యాంకు ఖాతాల నుంచి రూ.22 లక్షలు స్వాహా

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడంలేదు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశను ఆసరా చేసుకున్న ఆర్థిక నేరగాళ్లు సులువుగా మోసం చేసి వారి కష్టార్జితాన్ని స్వాహా చేస్తున్నారు. తాజాగా దుత్తలూరు మండలంలోని ఓ గ్రామంలో జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో టెలిగ్రామ్ యాప్ ద్వారా వర్క్ ఫ్రం హోం చేస్తే నగదు సంపాదించవచ్చని ఆశపడ్డాడు. ఆ యాప్‌లో నిత్య అనే యువతి పరిచయం కావడంతో ఆమె మాటలు నమ్మి వ్యాపార నిమిత్తం ఈ ఏడాది సెప్టెంబరు 23 నుంచి నవంబరు 7వ తేదీ వరకు సంస్థ రిజిస్ట్రేషన్, ఇతరత్రా పేర్లతో విడతల వారీగా వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ.22 లక్షలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా అవతలివైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయాయని గ్రహించి శుక్రవారం దుత్తలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జడ్పీ సీఈవోగా శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు (జడ్పీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సీఈవోగా శ్రీధర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. ఇదివరకు సీఈవోగా ఉన్న విద్యారమ ఈ ఏడాది జూన్‌లో బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండగా, డిప్యూటీ సీఈవో మోహన్‌రావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డీపీవోగా పని చేస్తున్న శ్రీధర్‌రెడ్డిని జడ్పీ సీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తహసీల్దార్లు, డీటీలకు బదిలీ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలువురు తహసీల్దార్లను, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలువాయి తహసీల్దారుగా కృష్ణారెడ్డిని, కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ డీఏవోను జలదంకికి డిప్యూటేషన్ పద్ధతిలో తహసీల్దారుగా నియమించారు. చేజర్ల తహసీల్దారు బి.మురళిని డిప్యుటేషన్‌పై ఇందుకూరుపేటకు బదిలీ చేశారు. అదేవిధంగా నలుగురు డీటీలను, ఒక సీనియర్ అసిస్టెంట్‌కూ స్థానభ్రంశం కల్పించారు.

పెన్నాడెల్టాకు నీటి సరఫరా పెంపు

అనంతసాగరం నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి పెన్నాడెల్టాకు సరఫరా చేస్తున్న నీటి మోతాదును పెంచారు. శుక్రవారం 6,998 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టులో 74.499 టీఎంసీల నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 300, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కులు సరఫరా చేస్తుండగా 8గేటు ఎత్తి మరో 5వేల క్యూసెక్కుల నీటిని పెన్నాకు విడుదల చేశారు.

అదంతా కాదండీ..

మేం చెప్పినోళ్లకే ఇవ్వండి!

● యూరియా పంపిణీపై నేతల తీరిది ● తలలు పట్టుకుంటున్న వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది

'అవన్నీ మాకనవసరమండీ. మేం చెప్పినోళ్లకు, సిఫార్సు చేసినోళ్లకు మాత్రం యూరియా బస్తాలు ఇవ్వాలి. మీవల్ల కాదంటే చెప్పండి. ఎవరితో ఎలా చెప్పించుకోవాలో మాకు తెలుసు. అక్కడే తేల్చుకుంటాం.'

- గ్రామాల్లో రాజకీయ నాయకుల వరస ఇది.



యూరియా పంపిణీ విషయం లో వీరి ఒత్తిళ్లు తట్టుకోలేక వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. రబీ సీజన్ మొదలు కావడంతో జిల్లావ్యాప్తంగా వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే, బహిరంగ మార్కెట్లో నిర్ణీత ధరకు యూరియా లభించడం లేదు. వ్యవసాయ శాఖ రైతుసేవాకేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎమ్మార్పీకే యూరియా అందించే ఏర్పాట్లు చేసింది. రైతులకు యూరియా కార్డులు పంపిణీ చేసి ఎకరానికి 3 బస్తాలు చొప్పున మూడు దఫాలుగా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించి పంపిణీ మొదలు పెట్టారు. ఈ విధానంలో యూరియా పంపిణీ చేయాల్సి ఉండగా ఇందులో కూటమి పార్టీల నాయకుల జోక్యం వ్యవసాయ శాఖ సిబ్బందికి తలనొప్పిగా మారింది. తాము సూచించిన వారికే యూరియా ఇవ్వాలని గ్రామస్థాయి నాయకులు ఒత్తిడి చేస్తుండటంతో వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. అంతేగాక తమ వ్యతిరేకులకు బస్తాలు ఇస్తే ఊరుకునేది లేదనే ధోరణిలో పలువురు నేతలు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిఫారసు ఉన్నవారికే ప్రాధాన్యత కింద యూరియా బస్తాలు అందుతుండటంతో రైతులు తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

● జిల్లావ్యాప్తంగా బ్లాక్‌మార్కెట్లో యూరియా విక్రయాలు జోరందుకున్నాయి. ఎమ్మార్పీకి యూరియా కావా లంటే తాము ఇచ్చిన క్రిమిసంహారక మందులు లేదా జింక్‌సల్ఫేట్ వంటి సూక్ష్మపోషకాలు తీసుకోవాల్సిందేనని వ్యాపారులు మెలిక పెడుతున్నారు. ఒక్కో బస్తా రూ.100లకుపైగా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యవసాయ శాఖ ఎన్ని దాడులు చేసినా ఈ బ్లాక్‌మార్కెట్ వ్యాపారం మాత్రం ఆగడం లేదు.

- జలదంకి (ఆంధ్రజ్యోతి)



జలదంకి : పొలంలో చల్లేందుకు డీఏపీ, యూరియా మిశ్రమాన్ని బస్తాలలో నింపుతున్న రైతులు

సోలార్‌కు నీళ్లొదిలారు!



● మూలకు చేరిన సోలార్ నీటి పథకాలు
● రూ. 5.24 కోట్ల ప్రజాధనం వృథా
● బాగుచేయించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ నిర్లక్ష్యం

దేశవ్యాప్తంగా సోలార్ వినియోగం ఎక్కువైంది. ఇంటింటా సౌర వ్యవస్థను తీసుకురావాలన్న లక్ష్యంతో పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎప్పటినుంచో ఉన్న వ్యవస్థను నీరుగార్చుతుండటం విమర్శలకు తావిస్తోంది. రూ.కోట్లు వెచ్చించి 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిన సోలార్ మంచినీటి సరఫరా విధానాన్ని నిర్లక్ష్యం చేయడమే ఇందుకు నిదర్శనం.

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉమ్మడిగా ఉన్నప్పుడు 2,622 హ్యాబిటేషన్లు ఉండగా మొదటి దశలో భాగంగా 107 చోట్ల మంచినీటి సమస్య పరిష్కరించేందుకు ప్రయోగాత్మకంగా సోలార్ డీఎల్ పంపుల విధానం తీసుకొచ్చారు. సంగం, బోగోలు, కొండాపురం, వింజమూరు, నాయుడుపేట, విడవలూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, చిట్టమూరు, తదితర మండలాల పరిధిలోని హ్యాబిటేషన్లలో ఏర్పాటు చేశారు.

● రూ.5.24 కోట్లు మంజూరు

ఓ ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించి ఒక్కొక్క సోలార్ పంపు సెట్‌కు రూ.5 లక్షల చొప్పున రూ.5.24 కోట్లు మంజూరు చేశారు. ఆ మేరకు 107 హ్యాబిటేషన్లలో ఖర్చు పెట్టారు. సంగం మండలం పడమటిపాళెం పంచాయతీలోని పల్లిపాళెం, వీర్లగుడిపాడులో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేశారు. ఈ రెండు పథకాలు కొంతకాలం బాగా పని చేసి ప్రజల తాగునీటి అవసరాలు తీరాయి. రెండేళ్లు సంస్థ పర్యవేక్షణలో జరిగాయి. గడువు తీరిన తరువాత ఆ సంస్థ తాగునీటి గ్రామీణాభివృద్ధి సంస్థకు అప్పగించారు.

● చోద్యం చూస్తున్న అధికారులు

ఆ తరువాత బోర్లు మరమ్మతులకు గురవడంతో మూలనపడ్డాయి. వీటిని బాగు చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదు. పలు గ్రామాల్లో సోలార్ పలకలు వినియోగంలో లేవు, చిన్నపాటి లోపాలనూ పట్టించుకోకపోవడంతో సోలార్ నీటి పథకాలు శాశ్వతంగా మూలన పడేశారు. ఇదే పరిస్థితి జిల్లా మొత్తం నెలకొంది. ప్రస్తుతం జిల్లాలో 99 శాతం సోలార్ పంపుసెట్లు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించి వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

25న మనుబోలు ఆస్పత్రి ప్రారంభం

మనుబోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిచే మనుబోలులో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం ప్రారంభోత్సవం, మనుబోలులో రూ.3 కోట్లతో నిర్మించనున్న బాలికల హాస్టల్ భవనానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11810
వెండి కిలో ధర	రూ. 155500
వెండి ఒక గ్రాము	రూ. 159.50

రక్తదానం ఎందరికో ప్రాణదానం

ముత్తుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ఎందరికో ప్రాణదానమని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. కృష్ణపట్నంలో శుక్రవారం శివాజీ యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోపూరు భాస్కర్ నాయుడు జన్మదిన సందర్భంగా హరిహరాదుల సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భాస్కర్‌ను అభినందించారు. కృష్ణపట్నం గ్రామ యువకులు 50 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో హరిహరాదులు సమితి ప్రతినిధులు పాండురంగయ్య, వెంకటరమణ, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాగాల శివకృష్ణ, నాయకులు మామిడాల శ్రీనివాసులు, వావిళ్ల జనార్థన్, ఉడతా ఈశ్వరయ్య, విజయ్ పాల్గొన్నారు.

30న ఏపీ ఎన్‌జీవో ఎన్నికలు

పొదలకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ పొదలకూరు తాలుకా యూనిట్ ఎన్నికలు స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఈనెల 30న జరుగుతాయని ఆ సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఓటర్ల నమోదు, 23న మధ్యాహ్నం వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు.

24 నుంచి సామాజిక తనిఖీ

మనుబోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీనుంచి మండలంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్‌పీ రవి శుక్రవారం తెలిపారు. ఏపీఎం రాజమ్మ నుంచి పనుల వివరాలు తెలుసుకుని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31 వరకు ఉపాధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల శాఖలకు సంబంధించి రూ. 5.84 కోట్ల పనులు చేశారన్నారు. వీటిపై నెల రోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలనలు, తనిఖీలు నిర్వహిస్తారన్నారు.











సీబీఐ అధికారుల పేరుతో డిజిటల్ అరెస్ట్

● రూ.23 లక్షలు స్వాహా ● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నెల్లూరు (క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు సీబీఐ అధికారుల పేరుతో ఓ వ్యక్తిని డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించి రూ.23 లక్షల నగదు దోచేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలో ఓ వ్యవసాయ శాస్త్రవేత్త నివాసం ఉంటున్నారు. ఆయనకు ఈ నెల 17వ తేదీన బెంగళూరు అశోక్‌నగర్ పోలీసు స్టేషన్ నుంచి సీఐను మాట్లాడుతున్నానంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశారు. మహిళలకు అసభ్యకర ఫొటోలు పంపినందున కేసు నమోదైందని, సీబీఐ అధికారులు మాట్లాడుతున్నట్లు వీడియో కాల్‌లో చూపించి ఆధార్‌కార్డ్ నెంబరు ఆధారంగా అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని భయపెట్టాడు. ఆ తర్వాత మరుసటి రోజు సీబీఐ అధికారి దయా నాయక్‌నంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేసి మాట్లాడాడు. సబాత్‌ఖాన్ అనే నేరస్థుడు ఇచ్చిన వాంగ్మూలంలో తన పేరు ఉందనీ, ముంబయి కెనరా బ్యాంకులో ఖాతా ఉందనీ, చైనా నుంచి రూ.3 కోట్లు నగదు మీ బ్యాంకు ఖాతాలో ఉందనీ అందుకు సుప్రీం కోర్టులో కేసు నమోదు అయ్యిందని భయపెట్టాడు. నిర్దోషి అని మీరు నిరూపించుకోవాలి అంటే రూ.30 లక్షలు డిపాజిట్ చేయాలంటూ శాస్త్రవేత్తను ఒత్తిడికి గురి చేశారు. రెండు రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.23,00,117 నగదు సైబర్ నేరగాళ్లు వేయించుకున్నారు. వారి మాటలతో అనుమానం వచ్చిన శాస్త్రవేత్త మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930 నెంబరు ఫిర్యాదు చేశారు. సీబీఐ అధికారుల పేరిట తనను బెదిరించి నగదు కాజేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాత్రి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చదనం- పరిశుభ్రతపై శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెం పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. సర్పంచు రజనీకాంత్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ మంజులమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ అశోక్‌కుమార్ హరిత రాయబారులు, గ్రీన్ గార్డులు, పంచాయతీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దళితవాడ, గిరిజనకాలనీ, పల్లిపాళెం, వడ్డిపాళెం, కానుగచెట్లుకాలనీ ప్రాంతాలలో చెత్తాచెదారం శుభ్రం చేశారు. చెత్తతో సంపద తయారీ కేంద్రం నుంచి పలు ప్రాంతాల్లో పర్య టించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లు, కోవూరు భరత్, తమ్మిరెడ్డి మల్లికార్జున్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో పరిశుభ్రత పెంపొందించాలి

మనుబోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హరిత రాయబారులు (గ్రీన్ అంబాసిడర్లు) పల్లెల్లో పరిశుభ్రతను పెంపొందించి, సుందరంగా తీర్చిదిద్దాలని డీఎల్‌డీవో వసుమతి పిలుపునిచ్చారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 19 పంచాయతీల్లో ఉన్న 50 మంది గ్రీన్ అంబాసిడర్లు ద్వారా మనుబోలు పంచాయతీలో ఒకేసారి 2వేల ఇళ్లనుంచి చెత్త సేకరించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, అన్ని గ్రామాల కార్యదర్శులు పర్యవేక్షించారు. క్లీన్ అండ్ గ్రీన్‌లో మండలంలోని పంచాయతీలు అవార్డులు తీసుకునే స్థాయిక ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ప్రసాద్, ఎంపీడీవో జలజాక్షి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

ముత్తుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు మత్స్యకళాశాలలో శుక్రవారం ప్రపంచ మత్స్యదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కే ధనపాల్ మాట్లాడుతూ మత్స్యకారులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు కలసి పనిచేస్తేనే వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోగలమన్నారు. చేపలు, జల ఉత్పత్తుల ద్వారా కలిగే ఆహార భద్రతను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మత్స్యకార సంఘం నాయకుడు గోవిందయ్యను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌ఏ డాక్టర్ ఆనంద్, ప్రొఫెసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ జసింత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

బుచ్చి కోఆపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షుడి మృతి


సీతారామిరెడ్డి(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రూరల్ కోఆపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మేనకూరు సీతారామిరెడ్డి (74) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. పలు పార్టీల నాయకులు సీతారామిరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత కోడూరు కమలాకర్ రెడ్డి, బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మురళి, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు. తదితరులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

ముత్తుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల సీఎస్‌ఆర్ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వల్లూరు పంచాయతీలోని ఎస్టీ కాలనీల్లో ఆయన పర్యటించారు. వల్లూరు ఎస్టీ కాలనీలో 27 కుటుంబాలను కార్గిల్ కంపెనీ దత్తత తీసుకోవడం హర్షణీయమన్నారు. మొదటి విడతలో వాటర్ ప్లాంటు ఏర్పాటు, కాలనీ లెవలింగ్, హెల్త్ సెంటర్ నిర్మాణం చేపడతారన్నారు. బుంగే కంపెనీ సెహగల్ ఫౌండేషన్ రైతులకు వ్యవసాయ పరికరాలు, స్ప్రింక్లర్లు, పోషక ఎరువులను అందజేస్తోందన్నారు. బ్రహ్మదేవం హైస్కూల్లో రూ. 35 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, అదనపు గది నిర్మాణం చేపడుతున్నారన్నారు. బ్రహ్మదేవం పరిధిలో ఆస్పత్రి నిర్మాణానికి ఎకరా 80 సెంట్లు స్థలం కేటాయిస్తున్నామని, ఎస్‌ఈఐఎల్ కంపెనీ ఆస్పత్రి నిర్మాణానికి ముందుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, పల్లికొండ శీనయ్య, వల్లూరు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి కృషితో సాగునీటి కేటాయింపు పెంపు

మనుబోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులకు కండలేరు ద్వారా సాగునీటి కేటాయింపు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కృషి వల్లే పెంచారని టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. డేగపూడి వద్ద సాగునీటి కేటాయింపు తానే పెంచానన్న మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలను టీడీపీ నాయకులు ఖండించారు. కాకాణి మండల రైతాంగానికి చేసిన మేలు ఏదీ లేదన్నారు. 2.5 టీఎంసీలకు నీటి కేటాయింపులు పెంచి పంటలు పండించిన ఘనత సోమిరెడ్డిదేనన్నారు. కండలేరుతో పాటు, కనుపూరు కాలువ కింద పంటలు ఎండిపోకూడదని, డేగపూడి-బండేపల్లి కాలువ చేయాలని కాలువ మంజూరు చేయించింది ఎమ్మెల్యేనే అన్నారు. మాజీ ఎమ్మెల్యే అసత్యప్రచారాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మనుబోలు నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రాయపాటి కిరణ్, తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దూరు గోపాల కృష్ణయ్య స్కూల్లో శుక్రవారం నిర్వహించిన భారీ పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. 1600 పుస్తకాలు సేకరించి ప్రదర్శనలో ఉంచారు. కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ప్రియురాలి కోసం ఆత్మహత్యాయత్నం

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలిని వదిలి ఉండలేనంటూ ఓ యువకుడు కలిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ఏపినాపి గ్రామానికి చెందిన కోటపాటి విష్ణువర్ధన్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమై, ఓ పాప కూడా ఉంది. విశాఖ వద్ద అనకాపల్లి సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న విష్ణువర్ధన్‌కు మరో మహిళ పరిచయమై, వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలియడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల విష్ణువర్ధన్ తన ప్రియురాలితో కలిసి అనకాపల్లి నుంచి వచ్చి ప్రకాశం జిల్లా పామూరులోని ఓ లాడ్జిలో ఉంటున్నాడు. ఇది తెలుసుకున్న భార్య పోలీసుల సాయంతో వారిని కలిగిరి స్టేషన్‌కు తీసుకువచ్చారు. తనకు భార్య వద్దని, తాను ప్రియురాలి వద్దే ఉంటానంటూ ఆస్తి మొత్తం భార్యకు చెందేలా కాగితాలు రాసిచ్చేశాడు. అయితే, తమ కుమార్తె అదృశ్యమైనట్లు యువతి (ప్రియురాలు) తల్లిదండ్రులు ఈ నెల 16న అనకాపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కలిగిరికి వచ్చి యువతిని తీసుకువెళ్లే ప్రయత్నంచేశారు. ఆమెను తీసుకెళితే తాను చనిపోతానంటూ స్టేషన్ ఎదుట పురుగుమందు తాగేశాడు. వెంటనే భార్య అయన్ను స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించింది.

మోటార్ల కేబుల్ వైరు చోరీ


స్టార్టర్ బాక్సును ధ్వంసం చేసిన దుండగులు

దుత్తలూరు (ఉదయ గిరి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరెడ్డిపల్లిలో పొలాల వద్ద మోటార్ల కేబుల్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘట న శుక్రవారం వెలుగుచూసింది. రైతులు తెలిపిన వివరాల మేరకు.. పొలాల్లో 15 మంది రైతులకు సం బంధించిన సాగునీటి మోటార్ల వద్ద స్టార్టర్ల బాక్సులు ధ్వంసం చేసి కేబుల్ వైర్లను చోరీ చేశారు. ఈ వైర్లలో విలువైన రాగి తీగ ఉండడంతో చోరీకి పాల్పడినట్లు, చోరీకి పాల్పడిన కేబుల్ వైర్ల విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

రుద్రకోట కేంద్రంగా గ్రావెల్ అక్రమ రవాణా

ఎక్స్‌కవేటర్, టిప్పర్ల స్వాధీనం


ధర్నా చేస్తున్న రుద్రకోట దళితులు

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం రుద్రకోట దళితులు భూములలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను గురువారం రాత్రి రైతులు అడ్డుకుని పోలీసులకు పట్టించారు. శుక్రవారం ఉదయం గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణసమితి ఆధ్వర్యంలో దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రుద్రకోట దళితులకు సీజేఎఫ్ కింద ఇచ్చిన భూములలో కావలికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న విషయాన్ని పశువుల కాపర్లు గమనించి దళిత రైతులకు తెలిపారు. దీంతో వారు గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్, టిప్పర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాగా గ్రావెల్ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో రుద్రకోట దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పీ. శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, స్థానిక రైతులు గోపాల్, శ్రీనివాసులు, దాసు, లక్ష్మయ్య, మోహన్‌రావు, రామచంద్రయ్య, సౌభాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మూడు సవర్ల బంగారు గొలుసు స్వాధీనం

నెల్లూరు(క్రైం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కల్యాణ మండపంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్న రాధాకృష్ణ పెద్ద కుమార్తె వివాహం ఈ ఏడాది ఆగస్టు 17వ తేదీన మైపాడు గేటు ప్రాంతంలోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. ఈక్రమంలో వధువు గదిలోని బంగారు గొలుసు, సూట్‌కేస్‌ను గుర్తుతెలియని దుండగలు అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు ప్రగతినగర్‌కు చెందిన పాత నేరస్థుడు బషీర్‌గా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి మూడు సవర్ల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నామని నవాబుపేట పోలీసులు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో పట్టుబడిన గంజాయి ధ్వంసం


జిందాల్ సంస్థకు తరలించి, గంజాయిని ధ్వంసం చేస్తున్న అధికారులు

నెల్లూరు (క్రైం), నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని వివి ధ ప్రాంతాల్లో పట్టుబడిన గంజాయిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేశారు. 64 కేసుల్లో 751 కేజీల 586 గ్రాముల డ్రై గంజాయి, 950 గ్రాముల హాషిష్ ఆయిల్, 4.2 మీటర్ల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని గుంటూరు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామ పరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థకు తరలించి శాస్త్రీయంగా ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు ఎం.శంకరయ్య (డీసీ,నెల్లూరు), పీ దయాసాగర్(ఏసీ), కే విజయ (డీసీ,ఒంగోలు), ఏ శ్రీనివాసులు నాయుడు (డీపీఈవో, నెల్లూరు), జే.రమేష్ (ఏఈఎస్, నెల్లూరు) తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 660	

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తనిఖీ

నెల్లూరు(క్రైం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ప్రమాదాల దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు గురువారం రాత్రి నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. బస్సుల పత్రాలను పరిశీలించడంతో పాటు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం నిబంధనలు పాటించాలని, లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి

న్యూస్ బాక్స్

వేదగిరి క్షేత్రంలో హుండీ లెక్కింపు

నెల్లూరురూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గడిచిన ఆరు నెలల కాలంలో వేదగిరి క్షేత్రానికి రూ.23.34 లక్షల ఆదాయం హుండీ ద్వారా సమకూరినట్లు ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. భక్తులు సమర్పించిన కానులలో నగదుతో పాటు 8 గ్రాముల బంగారం, 168 గ్రాముల వెండి వస్తువులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ మెడికల్ బిల్లులు చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులను వెంటనే చెల్లించాలని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆ సంఘం సర్వసభ్య సమావేశం నగరంలోని టౌన్‌హాల్లో జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి మెడికల్ రీయింబర్స్‌మెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. 12వ పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేసి ఐఆర్ 40శాతం ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా స్మార్ట్ విజన్ కంటి వైద్యశాల అధినేత డాక్టర్ రాజేంద్రనాథ్‌రెడ్డి వైద్య శిబిరం ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 40 మందికి కంటి ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తామని చెప్పారు.

గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన విద్యార్థికి అభినందన

నెల్లూరు(విద్య), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థి పీ.వెంకటజ్యోతిరెడ్డిని శుక్రవారం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ అభినందించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ రికార్డులు సాధిస్తుండడంతో తమ విద్యార్థికి ఈ అవార్డు వచ్చిందన్నారు. ప్రధానంగా రోలర్ స్కేటింగ్‌లో అద్భుత విన్యాసాలు చేస్తూ ఛాంపియన్ షిప్‌లు సాధించడంతో గుర్తింపు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శివసంకేత్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఆధార్'!

● నవీకరణకు అవకాశం

● పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు



నెల్లూరు(విద్య), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఎంతో కీలకమైన ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పోటీ పరీక్షలకు హాజరవ్వాలన్నా, ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా, ఇతర ఏ లబ్ధి పొందాలన్నా ఆధార్ ఎంతో కీలకమైంది. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఎదిగే విధానంలో వారి వేలిముద్రలు, ఇతర బయోమెట్రిక్ లక్షణాలు మారుతుంటాయి. ఆయా వివరాలను పక్కాగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్‌ను తప్పనిసరి చేసింది. దీనిలో భాగంగా విద్యార్థులందరూ ఆధార్‌ను నవీకరించుకోవాలి. దీనికోసం పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్‌ను నవీకరిస్తున్నారు. ప్రతీ ఐదేళ్లకు చిన్నారులు ఆధార్ అప్‌డేట్ చేయాలన్నది నిబంధన. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ ఆధార్ అప్‌డేట్ చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 5 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు 45,493 మంది, 15 ఏళ్ల పైబడిన వారు 38,638 మంది కలిపి 84,131 మంది ఆధార్ నవీకరించుకోవాల్సి ఉందని లెక్కలు తేల్చారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌లలో 85 ఆధార్ నవీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో వార్డు సచివాలయాల్లో విద్యార్థులకు ఆధార్ నవీకరణ సౌకర్యం కల్పించినప్పటికీ రోజుకు కొంతమంది మాత్రమే రావాలని, అది కూడా సచివాలయం పనివేళల్లో మాత్రమే చేస్తామని నిబంధన పెట్టడంతో అత్యధికశాతం మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకోలేకపోయారు. దీంతో ప్రభుత్వం పాఠశాలల్లో కూడా ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేసి ఈనెల 30వ తేదీ నాటికి అప్‌డేట్ పూర్తి చేయాలని ఆదేశించడంతో పాఠశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు.

పాఠశాలల్లో ఐదేళ్లు నిండిన విద్యార్థులు తొలిసారిగా, 15 ఏళ్లు నిండిన విద్యార్థులు రెండోసారి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. అప్‌డేట్ చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాల లబ్ధి, ఇతర గుర్తింపు విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఆయా వివరాలు ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు అందుకున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్


బీపీఎస్, ఎల్ఆర్ఎస్ కరపత్రాలను చూపుతున్న కమిషనర్ నందన్, కార్పొరేటర్లు

నెల్లూరు(సిటీ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31లోపు నిర్మించిన కట్టడాలకు ప్లాన్లు లేకపోయినా, ప్లాన్ ఉండి అతిక్రమలున్నా బీపీఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. ఇదీ చాలా సువర్ణ అవకాశమని తెలిపారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని వెల్లడించారు. వీటిపై ఎవరైన ఎలాంటి అనుమానాలున్నా 18004251113, లేదా 7981651881లకు ఫోన్లు చేసి పూర్తి సమాచారం పొందవచ్చన్నారు. కాగా రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో వర్షాలకు నిలిచిన నీటితో తలెత్తుతున్న ఇబ్బందులపై స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైన్లు క్లీన్ చేసి నీరు వేగవంతంగా బయటకు వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం సిటీప్లానింగ్ విభాగంతో సమీక్ష నిర్వహించిన ఆయన కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సర్వేయర్‌తో సమన్వయం చేసుకుని నిర్ధేశించిన పనులనిన్నింటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు ఏసీపీలు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

రికార్డు స్థాయిలో సీఎం సహాయనిధి సాయం

● బాధితులకు చెక్కులు అందజేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి


బాధితులకు చెక్కులు అందజేస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రి సహాయనిధి సాయం అందజేసినట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని సోమిరెడ్డి కార్యాలయంలో శుక్రవారం 92 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.74 లక్షల చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలను ఉదారంగా ఆదుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకు సర్వేపల్లి నియోజకవర్గంలో 514 మంది బాధితులకు రూ.5.34 కోట్లు పంపిణీ చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి పేదలతో పాటు రైతుల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల వేట విరామ సమయంలో రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచామన్నారు. ఆటోడ్రైవర్‌లకు ఏటా రూ.15వేల వంతున సాయం అందిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్ రూ.4వేలు, 6వేలు, 15వేలు పెంచిన ఘనత ప్రభుత్వానిదేనని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధికి, యువపారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కండలేరు ప్రాజెక్టు నుంచి మనుబోలుకు 2.5 టీఎంసీల నీరు సరఫరా పెంచామని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీమంత్రి కాకాణి చెప్పుకునేందుకు చేసిన పని ఒక్కటుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల ఉద్వాపన పూజ


ప్రత్యేక అలంకారంలో రాజరాజేశ్వరి, రాహుకాల ఉద్వాపన పూజలు చేస్తున్న మహిళలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్వాపన పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని రాహుకాల దీపారాధనలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం వేదపారాయణం, సంధ్యామేళం, రాత్రి కుంభ హారతులు, ప్రత్యేక పల్లకీసేవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దనరెడ్డి, అర్చకులు, ధర్మకర్తలు, సిబ్బంది పర్యవేక్షించారు.

తుఫాన్ సాయం అందజేయాలి

పొదలకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల్లో తుఫాన్ సాయం కొందరికే అందిందని, మిగిలిన వారందరికీ ఇవ్వాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొదలకూరులో 36 కుటుంబాలు మగ్గాలమీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. తుఫాన్ సమయంలో పనులు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో చింతగింజల సుబ్రహ్మణ్యం, చొప్పా వెంకటేశ్వర్లు, బీజేపీ మండలాధ్యక్షుడు పీ.ప్రశాంత్, ఆర్ ధనుంజయరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళనకు ఐద్వా మద్దతు


పారిశుధ్య కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఐద్వా నాయకురాళ్లు

నెల్లూరు(సిటీ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ కనీస డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 18 రోజులుగా కార్పొరేషన్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళనకు శుక్రవారం జిల్లా ఐద్వా నాయకురాళ్లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నేత షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సమ్మె కాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇస్తామన్న వేతనాలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసే కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలతో కూడిన అవకాశం కల్పించాలని, మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో వారసులకు ఉద్యోగ అవకాశాలు ఇచ్చి వారికి భద్రత, భరోసా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షంషాద్, అరిగెల రమమ్మ, వరలక్ష్మి, కత్తిపద్మ, సీఐటీయూ నాయకులు కత్తి శ్రీనివాసులు, అశోక్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి మహా దీపారాధన


అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీవేలి ఉత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం మండలి పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాలాభిషేకం, మహాగణపతి హోమం, శ్రీవేలి ఉత్సవం, కలిశపూజ, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాళం పూజ జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఉభయకర్తలు, ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద పూడికతీత

నెల్లూరు(వైద్యం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ కుక్కలగుంట కూడలిలోని కల్వర్టు వద్ద కాలువ బ్లాక్ అవడంతో స్థానికులు టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లి శుక్రవారం పూడికతీత పనులు చేపట్టారు. టీడీపీ 47 డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టారు.

శాలివాహన సంఘాల నిరసన

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఐ సతీష్‌కుమార్ మరణం అనుమానాస్పదం అంటూ శాలివాహన సంఘాలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బుచ్చిలోని శాంతినగర్‌లోని శాలివాహన కమ్యూనిటీ భవనం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆ సంఘం నాయకులు, మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాచవరం శ్రీనివాసులు, కల్యాణ్, వెంకటేశ్వర్లు, కాసా శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రన్న పార్కులతో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ


అధికారులతో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్లో చంద్రన్న పార్కుల బాట కార్యక్రమం ద్వారా వందల కోట్ల విలువ చేసే పార్కు స్థలాలను కాపాడినట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 26 డివిజన్‌లో పర్యటించి మాట్లాడుతూ 18 ఎకరాల విస్తీర్ణం కలిగిన పార్కుకు రూ.7 కోట్లతో ప్రహరీ నిర్మించి అత్యంత ఖరీదైన ప్రభుత్వ ఆస్తికి రక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోకి వచ్చే ఈ డివిజన్లలో రూ.35 లక్షలతో 2,370 మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే 1900 మొక్కలు నాటడం పూర్తయిందని తెలిపారు. స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నాటిన మొక్కలను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. కాగా 30వ డివిజన్ పరిధిలోని ఏవీకే ఎస్టేట్ నందు ప్రభుత్వ పార్కును సందర్శించి అక్కడ తీసుకోవాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు, మస్తాన్‌నాయుడు, యానదయ్య, ఓబుల్‌రాజు పాల్గొన్నారు.

'పది' విద్యార్థుల పరీక్ష ఫీజుకు నగదు అందజేత

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి శుక్రవారం కోవూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థుల పరీక్ష ఫీజుకు నగదు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని తన నివాసంలో రూ.2.96 లక్షలను మండల విద్యాశాఖాధికారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

రాపూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం అనిల్‌కుమార్, ఉపాధ్యాయుడు పెంచలయ్య, గ్రంథాలయ అధికారి అంజయ్య పాల్గొన్నారు.



నగరాన్ని కమ్మేసిన మబ్బులు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నెల్లూరులో రోజంతా అప్పుడప్పుడు ఎండ.. ఆ తర్వాత వాన కురిసింది. కాగా, నగరాన్ని నల్లటి మబ్బులు కమ్మేశాయి. దీనికితోడు చలిగాలులు వీచడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



స్వామియే శరణం అయ్యప్ప!

సంగంలోని శివాజీ సెంటర్‌లో అయ్యప్ప పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. స్వామివారికి పదహారు మెట్ల ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులకు రాత్రి భిక్ష ఏర్పాటు చేశారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- మత్స్యకారులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపు
- ఉత్సాహంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మత్స్యకార సంక్షేమ పథకాలను మత్స్యకారులు, రైతులు, సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మత్స్య దినోత్సవం సందర్భంగా నగరంలోని పురమందిరంలో జరిగిన కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన ప్రభుత్వ పథకాలను కూటమి ప్రభుత్వం రెట్టింపు సహాయం కల్పిస్తూ అమలు చేస్తోందని చెప్పారు. సముద్రంలో జెట్టీల నిర్మాణాలకు పలు ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని మత్స్యకార సంఘాలన్నీ అందరికీ ఉపయోగపడే అంశాలను వినతి పత్రం ద్వారా ఇస్తే ప్రజాప్రతినిదులమైన తామంతా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలను రాబట్టుకునేందుకు జిల్లాలోని ఎంపీలను కలవాలని మత్స్యకార సంఘాల నాయకులు, సొసైటీల అధ్యక్షులకు సూచించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మత్స్య సంపదకు గిట్టుబాటు ధర కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ద్వారా కృషి చేస్తుందన్నారు. ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు తనను కలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్ బేస్ అథారిటీ చైర్మన్ జెడ్ శివప్రసాద్, మత్స్యశాఖ జేడీ కే.శాంతి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొండూరు పాలిచెట్టి, డైరెక్టర్ ఎంఎఫ్‌డీబీ కోలంగారి పోలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మత్స్యకారులకు మోటార్లు, బోటు, వలలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



ప్రపంచ మత్స్య దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

బస్సులో పొగలు.. ప్రయాణికుల పరుగులు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొట్టాలు గ్రామం వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సులో పొగలు రావడంతో ప్రయాణికులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఉదయగిరి డిపోకు చెందిన బస్సు సాయంత్రం 5 గంటల సమయంలో ఉదయగిరి నుంచి విద్యార్థు లు, ప్రయాణికులతో జీ.అయ్యవారిపల్లికి బయలుదేరింది కొట్టాలు గ్రామ సమీపాని కి బస్సు చేరగానే డ్రైవర్ వద్ద ఉన్న స్విచ్ బోర్డు షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ దానిపై నీళ్లు చల్లడంతో బస్సులో పొగలు కమ్ముకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థులు, ప్రయాణికులు కిందకు దిగి పరుగులు తీశారు. స్విచ్ బోర్డు దగ్ధమవడంతో లైట్లు వెలగలేదు. చేసేదిలేక డ్రైవర్ వారందరినీ అక్కడే దించేసి వెళ్లిపోయాడు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు అటవీ మార్గం మీదుగా నడుస్తు విద్యార్థులు, ప్రయాణికులు ఇళ్లకు చేరుకోవాల్సి వచ్చింది.

'పల్లెవెలుగు'లో అవస్థల ప్రయాణం



- మరమ్మతులు చేయకనే రోడ్లపైకి బస్సులు
- వర్షం వస్తే ప్రయాణికులు తడవాల్సిందే!

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం నరకంగా మారుతోంది. మరీ ముఖ్యంగా వర్షం కురిస్తేచాలు ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. జిల్లావ్యాప్తంగా 650కిపైగా ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో సగానికిపైగా పల్లెవెలుగు సర్వీసులు ఉన్నాయి. అయితే, వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండానే రోడ్లపై తిప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు కిటికీలు మూద్దామనుకుంటే అవి స్టక్ అయి బిగుసుకుపోయి ఉంటున్నాయి. కొన్ని బస్సుల్లో ఒక అద్దం మాత్రమే ఉండటంతో వర్షపునీరు లోపలకు వచ్చి ప్రయాణికులు తడిసిపోతున్నారు. పైకప్పులో అక్కడక్కడా రంధ్రాలు ఉండటంతో నీరంతా లోపలకు వస్తోంది. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పల్లెవెలుగు బస్సుల్లో రద్దీ ఎక్కువైంది. అయితే, ఎక్కువ శాతం బస్సులకు డోర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదపు అంచుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక బస్సుల మెయింటెన్స్ రోజు చేస్తున్నా పూర్తిస్థాయిలో స్పేర్ పార్ట్‌లు బస్సులకు బిగించకుండా పైపైనే మరమతులు చేసి తిప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పల్లెవెలుగు సర్వీసులకు ఎక్కువ శాతం అరిగిన టైర్లు ఉండటంతో బ్రేక్‌లు వేసినా సరిగ్గా పడటంలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేమని సాక్షాత్తు కొందరు డ్రైవర్లు, మెకానిక్‌లు చెబుతున్నారు. పలు కార్మిక యూనియన్‌లు సైతం గ్యారేజ్‌లలో పూర్తిస్థాయిలో స్పేర్‌పార్ట్స్ తెప్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నాయి.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



ఈ బస్సుకు డోర్ ఏమైంది!? సడన్ బ్రేక్ వేస్తే అంతేమరి!



ఈ కిటికీ అద్దం మూసుకునేనా..



ఈ తీగ ఏంటి!? ఇలా వచ్చేసింది!



ఇలాంటి రంధ్రాలు ఉంటే ప్రయాణికులు తడవరా!

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టండి

- విద్యుత్ శాఖ ఎస్ఈ రాఘవేంద్రం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్తు ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన ముందస్తు చర్యలను తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ రాఘవేంద్రం అధికారులను ఆదేశించారు. విద్యుత్‌భవన్‌లో రూరల్, డివిజన్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను క్రమం తప్పకుండా చేయాల న్నారు. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలను అందించాలన్నారు. అలాగే సిబ్బంది, అధికారులు నిర్ధేశించిన సమయానికి కార్యాలయాలకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్ అధికారి మురళి, రూరల్ ఈఈలు లక్ష్మీనారాయణ, శేషాద్రి బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించండి

- అధికారులకు నుడా చైర్మన్ ఆదేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్లు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించి వారు సద్వినియోగం చేసుకునేలా అధికారులంతా క్షేత్రస్థాయిలో పని చేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. శుక్ర వారం జిల్లాలోని తహసీలార్లు, డీటీలు, పంచాయతీ కార్యదర్శులతో నుడీ వీసీ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో క్రమబద్ధీకరణను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. అక్రమ లేఅవుట్లకు సంబంధించి గడువు ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పిం చిందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి లో ప్రతి అధికారి బాధ్యతగా తీసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచల్ రెడ్డి, పీవో హిమ బిందు, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, పక్కన వీసీ వెంకటేశ్వర్లు

పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 2002 నుంచి 2005 మధ్య నమోదైన ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ కూడా చేపట్టినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా నవీకరణ జరుగుతుందని, ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయకుమార్, రసూల్(టీడీపీ), శ్రీనివాస్(బీజేపీ), వెంకట శేషయ్య (వైసీపీ), శ్రీరామ్(బీఎస్పీ), బాలసుధాకర్(కాంగ్రెస్) పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ శుక్లా, డీఆర్వో

● ఉద్యోగుల గ్రీవెన్స్

ఉద్యోగుల కోసం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ శుక్లా స్వయంగా ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతీ ఉద్యోగితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 22 మంది ఉద్యోగులు వినతులిచ్చారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కారుణ్య నియామక ఉత్తర్వులు...

ముగ్గురు మహిళలకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తూ కలెక్టర్ శుక్లా నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు.

● అక్రిడిటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులు (2026-27) రెండేళ్ల కాలానికి సమాచార పౌరసంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:మీడియా రిలేషన్స్.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈనెల ఆఖరుతో ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

● విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరపాలి

నెల్లూరు(వైద్యం) : మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామా అంకయ్య మాట్లాడుతూ 14 ఏళ్ల బాలిక మృతి అనుమానాస్పదంగా ఉందని, పాఠశాల అధికారులు మాత్రం ఆత్మహత్యని చెబుతున్నారన్నారు. ఆ విద్యాసంస్థ నిర్లక్ష్యం, మానసిక వేధింపుల కారణంగా బాలిక మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పోస్టుమార్టం మహిళా వైద్యులు కాకుండా పురుష డాక్టర్ నిర్వహించటంపై బాలిక తల్లిదండ్రులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు, సిరాజ్, షాన్‌వాజ్, ముక్తియార్, షాజహాన్, అహమద్, రియాజ్, మునివర్ తదితరులు పాల్గొన్నారు.

● పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కూలి తీసుకుని.. గుట్టుగా జారుకుని..!

- 'ఉపాధి' పథకంలో అక్రమాలకు బ్రేక్
- ఈకేవైసీకి దూరంగా 1,31,718 మంది
- అక్రమాలు బయటపడతాయనే..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో క్షేత్రస్థాయిలో పలువురు ఈకేవైసీకి దూరంగా ఉన్నారు.



ఉదయగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 37 మండలాల్లో 4,90,910 మంది కూలీలు ఉండగా ఇప్పటివరకు 3,59,192 మందికి (73.54 శాతం) ఈకేవైసీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 1,31,718 మంది ఈకేవైసీకి దూరంగా ఉంటున్నారు. రికార్డుల్లో ఉన్న కూలీలు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వీరు పనులకు రాకున్నా వేతనాలు మాత్రం అందుకోవడం గమనార్హం. ఉదయగిరి 68.91, కోవూరు 62.92, దుత్తలూరు 76.12, సీతారామపురం 65.78 శాతం చొప్పున మాత్రమే ఈకేవైసీ పూర్తయ్యింది. పలు ప్రాంతాల్లో వలస వాసులు అధికం. వారంతా ఇతర ప్రాంతాల్లో ఉన్నా ఇక్కడ ఉపాధి హామీ పనికి వచ్చినట్లు మస్టర్ వేస్తూ నగదు స్వాహా చేస్తున్నారు. మిగిలిన వారి కోసం సిబ్బంది గ్రామాల్లో గాలింపు చేస్తున్నారు.

● వివరాల సేకరణలో అధికారులు

ఉపాధి హామీ పథకంలో చేయని పనులు చేసినట్లు కొన్ని చోట్ల నమోదు చేశారు. పనికి రాకున్నా వచ్చినట్లు చాలా ప్రాంతాల్లో దొంగ మస్టర్లు వేశారు. పని ప్రదేశంలో అందరినీ గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమల్లోకి తెచ్చినా దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. దీంతో అక్రమాలు భారీగా జరిగాయి. హైదరాబాదు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్థానికంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగుల పేర్లతో గ్రామాల్లో వేతనాలు స్వాహా చేశారనే విషయం సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. జాబ్‌కార్డు ఉండి పనులకు రాని కొందరు ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావడంలేదు. ఈకేవైసీ చేయించుకుంటే గతంలో చేసిన తప్పులు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో వారంతా ఈకేవైసీకి దూరంగా ఉన్నట్లు సమాచారం. ఈకేవైసీకి దూరంగా ఉన్న వారి వివరాలను సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈకేవైసీ పూర్తయిన తరువాతనే వీరికి పనులు కల్పిస్తారు. పని జరిగే ప్రదేశంలో ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.



రామస్వామిపాలెం దళితవాడలో బురదమయంగా రోడ్డు

కొద్దిపాటి వర్షానికే ఇలా...

బిట్రగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం దళితవాడలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డు బురదమయంగా మారింది. ఇటీవల జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో పైప్‌లైన్ వేశారు. అయితే పైప్‌లైన్ కోసం తీసిన కాలువ గుంట సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదాలు జరుగక ముందే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి : డీఈవో

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రాజా బాలాజీరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సంగం మండలంలోని మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఆర్‌డీవో రాజేష్ సైంటిస్ట్ బృందం పాఠశాలకు అందచేసిన వాటర్ కూలర్, ల్యాబ్ పరికరాలు, సౌండ్ సిస్టం, లైబ్రరీ బుక్స్, పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ తదితర సామగ్రిని విద్యార్థులకు అందచేశారు. ఈసందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. దాతలను అభినందించారు. అదేవిధంగా అజయ్‌రెడ్డి బృందం విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకిరామ్, ఎంఈవో 2 మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రాజా బాలాజీరావు

రేపు అయ్యప్పస్వామి పడిపూజ

ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘనాథస్వామి నూతన కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు గురుస్వామి బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించనున్నట్లు మణికంఠ సేవా సమాజం నిర్వాహకులు తెలిపారు. కావున ఆత్మకూరు పరిసర ప్రాంతాల అయ్యప్పస్వాములు, ప్రజలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11810
వెండి కిలో ధర	రూ. 155500
వెండి ఒక గ్రాము	రూ. 159.50

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఎంపీడీవో



ఉదయగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతపై దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని గండిపాళెం పంచాయతీ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పంచాయతీ పరిధిలోని అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతినిత్యం తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించి వానపాముల ద్వారా సేంద్రీయ ఎరువును తయారుచేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు సైతం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు బస్టాండ్ సెంటర్‌లోని దుకాణదారులకు అవగాహన కల్పించి పరిసరాలను శుభ్రం చేయించారు. చెత్తా, చెదారాన్ని ఇష్టానుసారంగా పడేయకుండా సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహనరావు, పంచాయతీ అభివృద్ధి అధి కారులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, గార్డులు తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం :** మండల కేంద్రంలోని సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిక్షణలో భాగంగా పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం సంపద తయారీ కేంద్రం వద్ద తొట్టెల్లోని వర్మికంపోస్ట్ తయారీని ఎంపీడీవో పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో పిడుగు రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు షేక్ షఫీ, నరేంద్ర, తేజ, షేక్ అస్రాఫ్, పారి శుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

సీతారామపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం గ్రామ పంచాయతీలోని నారాయణంపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో షేక్ మస్తాన్‌వలి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. అలాగే తెలుగు, ఆంగ్లం, గుణింతాలు సులభంగా పిల్లలకు ఎలా నేర్పించాలో తెలియజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం ఎలా ఉంటోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర బృందం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారితో పాటు పాఠశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించడంతో పాటు జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో వీధులు జలమయం



సంగంలో కురుస్తున్న వర్షం

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లు చిత్తడిగా మారడంతో ద్విచక్ర వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. రోజువారి కూలీలు, ప్రజలు ఇబ్బంది పడ్డారు.

●**అనంతసాగరం :** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి జోరు వర్షం కురిసింది. దీంతో వీధులు జలమయమయ్యాయి. వరిసాగుకు సిద్ధమవుతున్న రైతులు నార్ల కోసం విత్తనాలు చల్లుకొన్నారు. మెట్ట పైర్లు మిరప, బొప్పాయి పంటలకు వర్షంతో మేలు జరుగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సీతారామపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సంగసానిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్ర వారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... ఎస్ఆర్ నగర్ గ్రామానికి చెందిన తురక మౌలాలి బైక్‌పై సీతారామపురం వస్తుండగా సంగసాని పల్లి గ్రామ సమీపంలో గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా అతడిని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు ఏప కాలనీ సమీపాన పొలాల్లో నిర్వహిస్తున్న జూద స్థావరంపై గురువారం రాత్రి ఎస్ఐ ఆదిలక్ష్మీ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో నలుగురు పేకాట రాయుళ్లతో పాటు రూ.26,100ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ యువతి అదృశ్యమైనట్లు శుక్రవారం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 19వ తేదీ నుంచి తమ కుమార్తె కనిపించడంలేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మీ తెలిపారు.

ఆలయాల్లో పోలి పాడ్యమి పూజలు



గండిపాళెం సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం పోలి పాడ్యమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతో పాటు మండలంలోని గండిపాళెం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ, అప్పసముద్రం తదితర గ్రామాల ఆలయాల సమీపాల్లోని నీటి వనరుల్లో దీపాలు వెలిగించి నీటిలో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయా లకు వెళ్లి పరమేశ్వరునికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉర్దూ పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఉర్దూ డీఐ షేక్ ఖాజామోహిద్దీన్

ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామోహిద్దీన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను, రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పొదుపులో ఇక అక్రమాలకు చెక్

● **లోకోస్ యాప్‌లో వివరాలు నమోదు**



స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీసీ

మర్రిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, సమావేశాలు, తీర్మానాలు తదితర వివరాలన్నీ ఇకపై పక్కాగా ఉండనున్నాయి. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి సమాచారం సభ్యులందరికీ త్వరలో అందుబాటులోకి రానుంది. సంఘాలకు సంబంధించిన అన్నీ వివరాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు 5782 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 50820 మంది సభ్యులు 144 మంది ఎన్యూమరేటర్లు ఉన్నారు. ఈ సంఘాల వివరాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉంచటంతోపాటు అవక తవకలకు అడ్డుకట్ట వేసేలా కేంద్ర ప్రభుత్వం 2023లోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. పోర్టల్ నిర్వహణ ఎస్‌హెచ్‌జీల వివరాలు అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించటంతో క్షేత్రస్థాయికి చేరలేదు. కాగా, కూటమి ప్రభుత్వం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ యాప్‌ను పునర్వ్యవస్థీకరిస్తున్నారు. ఇప్పటికే వీవోఏల నుంచి అధికారుల వరకు శిక్షణ ఇచ్చారు. వారు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా సంఘాల పూర్తి వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సంఘాలకు సంబంధించిన బ్యాంక్ లింకేజి రుణాలు, ఉన్నతి, శ్రీనిధి, పెట్టుబడి సాయం, పొదుపు నిల్వ, అంతర్గత అప్పులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సమావేశాల తీర్మానాలు, రుణాలు, అప్పులు, వసూళ్లు, బ్యాంకులకు చెల్లింపులు తదితరాలన్నీ లోకోస్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. పిఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ వంటి పథకాల గురించి తెలుసుకోవచ్చు. సభ్యులందరూ ప్లేస్టోర్ నుంచి యాప్‌లను డౌన్లోడ్ చేసుకొని ప్రత్యేక లాగిన్ ఐడీల ద్వారా ఎక్కడి నుంచైనా వివరాలు పరిశీలించుకోవచ్చు. ఆయా సంఘాల స్థితిగతులను అధికారులు తెలుసుకునే వీలు కలుగుతుంది.

మెట్టలో జోరుగా జూదం

ఉదయగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి శివారున మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో జూదం జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేకాట, కోడిపందేలు నిర్వహించే నిర్వాహకులు కొంతమొత్తంలో ఆటగాళ్ల నుంచి నగదు వసూలుచేసి సకల సౌకర్యాలు కల్పిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రోజుకో ప్రాంతంలో స్థావరాలను ఏర్పాటుస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరితో పాటు కృష్ణంపల్లి, వెంకటంపేట, వరికుంటపాడు మండలం జీ.కొండారెడ్డిపల్లి, తూర్పుబోయమడగల, తోటలచెరువుపల్లి, ఇస్కపల్లి, జడదేవి, కాంచెరువు, వింజమూరు మండలం చాకలికొండ, వింజమూరు, కాటేపల్లి, దుత్తలూరు మండలం నర్రవాడ, దుత్తలూరు తదితర గ్రామాల్లో ప్రతినిత్యం పేకాట జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో ఉండే నివాసాలు, అటవీ, ప్రభుత్వ భూములు, పొలాల్లో ప్రతినిత్యం నిర్వహించే ఆటకు ఇతర ప్రాంతాల నుంచి సైతం పేకాటరాయళ్ల పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది ఆటగాళ్ల జేబులు నింపుకుంటుండగా, మరికొంతమంది అప్పులపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో కోడిపందేలను కూడా జోరుగానే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూదాన్ని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గు చూపాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త వినీత

ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలైన సజ్జ, జొన్న, రాగులు, మొక్క జొన్న, కొర్రలు తదితర పంటల సాగుపై రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయ పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త యు వినీత సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సముదాయంలో శుక్రవారం ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఏఎస్ పేట, అనంతసాగరం, ఆత్మకూరు మండలాల రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక పోషకాలు కలిగిన ఈ ఆహార పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఇన్‌చార్జ్ వ్యవసాయ ఉప సంచాలకులు ఈ శైలజాకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందని, తక్కువ నీటి వనరులు ఉన్నప్పుడు వర్షాధారంగా చిరుధాన్యాల సాగును ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేసుకోవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పి చంద్రభాను, కె కిషోర్ బాబు, ఎం సురేష్‌బాబు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల ద్వారా యూరియా పంపిణీ



సంగం: రైతులకు యూరియా అందచేస్తున్న సిబ్బంది

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడు పంచాయతీ కార్యాలయంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా కృత్రిమ కొరత నివారించేందుకు ప్రభుత్వం రైతులకు కార్డుల ద్వారా ప్రతి ఎకరాకు మూడు బస్తాల చొప్పున రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా సరఫరా చేశారు. గ్రామంలో ఆర్ఎస్‌కే, సొసైటీ లేకపోవడంతో సంగం, లేదా కొరిమెర్లకు వెళ్లి తెచ్చుకోవలసి వస్తోంది. దీంతో రైతులకు రవాణా భారంగా మారింది. గుర్తించిన సాగునీటి సంఘం అధ్యక్షుడు షఫ్రక్ బాబు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి యూరియా గ్రామానికి తీసుకోవచ్చి రైతులకు సరఫరా చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

●**అనంతసాగరం:** మొదటి పంట సాగు చేస్తున్న రైతులందరికీ సరిపడా యూరియా రైతు సేవాకేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తుందని మండల తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి రైతుసేవా కేంద్రంలో శుక్రవారం సబ్సిడీ యూరియాను పంపిణీ చేశారు. అధికారుల సూచనల మేరకు యూరియా వినియోగించుకోవాలని సూచించారు.

ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడిగా రియాజ్



ఎంపికైన ఉదయగిరి తాలుకా ఎన్‌జీజీవో కార్యవర్గం

ఉదయగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడిగా షేక్ రియాజ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక షాదీ మంజిల్‌లో ఎన్నికల అధికారిగా కావలి ఎన్‌జీజీవో అధ్యక్షుడు శివ కుమార్, అబ్జర్వర్ కిరణ్‌ల సమక్షంలో ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీజీవో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడిగా షేక్ రియాజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం తిరుపతమ్మ, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఖాజానవాజ్, భోగ్యం సుధీర్‌కుమార్, షేక్ గౌస్‌అహ్మద్, కార్యదర్శిగా వీవీ రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులుగా షేక్ అంజాద్, ఎం మహేష్, భోగ్యం గాయత్రీ, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఏ రోజారమణి, ట్రెజరర్‌గా రాజశేఖర్‌రాజులను సభ్యుల సమ్మతితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కార్యదర్శి రామకృష్ణతోపాటు సభ్యులు, ఉద్యోగులు, స్నేహితులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం బాధ్యతగా పనిచేయాలన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు షేక్ ఫయాజుద్దీన్

ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయని, సద్వినియోగం చేసుకోవాలని వెస్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్‌ఫయాజుద్దీన్ తెలి పారు. ఆత్మకూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం శుక్రవారం స్థానిక వెస్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత విలువైన పుస్తకాలు గ్రథాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. పాఠకులు, విద్యార్థుల గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే అంగన్‌వాడీలకు పదోన్నతులు : సీఐటీయూ

ఉదయగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కల్పించిందని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్యలు పేర్కొన్నారు. వారిని శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పదోన్నతి పొందిన కార్యకర్తలు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 42 రోజులపాటు అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామన్నారు. ఆ పోరాట ఫలితంగానే ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో 36 మందికి పదోన్నతి లభించిందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నాయబ్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వృథాకు అడ్డుకట్ట

ఉదయగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఊర చెరువుకు జలకళ సంతరించుకుంది. అయితే చెరువు అలుగు ప్రాంతం దెబ్బతిని నీరు వృథాగా పోతుండడంతో చెరువు ఆయకట్టును దృష్టిలో ఉంచుకుని గ్రామ టీడీపీ నాయకుడు పాలగిరి మహేష్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి ఎక్స్‌కవేటర్ సహాయంతో నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈర్ల సుధ, కారంపూడి కేశవనారాయణ, వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ప్రియురాలి కోసం ఆత్మహత్యాయత్నం

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలిని వదిలి ఉండలేనంటూ ఓ యువకుడు కలిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ఏపినాపి గ్రామానికి చెందిన కోటపాటి విష్ణువర్ధన్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమై, ఓ పాప కూడా ఉంది. విశాఖ వద్ద అనకాపల్లి సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న విష్ణువర్ధన్‌కు మరో మహిళ పరిచయమై, వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలియడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల విష్ణువర్ధన్ తన ప్రియురాలితో కలిసి అనకాపల్లి నుంచి వచ్చి ప్రకాశం జిల్లా పామూరులోని ఓ లాడ్జిలో ఉంటున్నాడు. ఇది తెలుసుకున్న భార్య పోలీసుల సాయంతో వారిని కలిగిరి స్టేషన్‌కు తీసుకువచ్చారు. తనకు భార్య వద్దని, తాను ప్రియురాలి వద్దే ఉంటానంటూ ఆస్తి మొత్తం భార్యకు చెందేలా కాగితాలు రాసిచ్చేశాడు. అయితే, తమ కుమార్తె అదృశ్యమైనట్లు యువతి (ప్రియురాలు) తల్లిదండ్రులు ఈ నెల 16న అనకాపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కలిగిరికి వచ్చి యువతిని తీసుకువెళ్లే ప్రయత్నంచేశారు. ఆమెను తీసుకెళితే తాను చనిపోతానంటూ స్టేషన్ ఎదుట పురుగుమందు తాగేశాడు. వెంటనే భార్య ఆయన్ను స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించింది.

మోటార్ల కేబుల్ వైరు చోరీ



స్టార్టర్ బాక్సును ధ్వంసం చేసిన దుండగులు

దుత్తలూరు (ఉదయ గిరి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరెడ్డిపల్లిలో పొలాల వద్ద మోటార్ల కేబుల్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘట న శుక్రవారం వెలుగుచూసింది. రైతులు తెలిపిన వివరాల మేరకు.. పొలాల్లో 15 మంది రైతులకు సం బంధించిన సాగు నీటి మోటార్ల వద్ద స్టార్టర్ల బాక్సులు ధ్వంసం చేసి కేబుల్ వైర్లను చోరీ చేశారు. ఈ వైర్లలో విలువైన రాగి తీగ ఉండడంతో చోరీకి పాల్పడినట్లు, చోరీకి పాల్పడిన కేబుల్ వైర్ల విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

రుద్రకోట కేంద్రంగా గ్రావెల్ అక్రమ రవాణా

ఎక్స్‌కవేటర్, టిప్పర్ల స్వాధీనం



ధర్నా చేస్తున్న రుద్రకోట దళితులు

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం రుద్రకోట దళితులు భూములలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను గురువారం రాత్రి రైతులు అడ్డుకుని పోలీసులకు పట్టించారు. శుక్రవారం ఉదయం గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణసమితి ఆధ్వర్యంలో దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రుద్రకోట దళితులకు సీజేఎఫ్ కింద ఇచ్చిన భూములలో కావలికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న విషయాన్ని పశువుల కాపర్లు గమనించి దళిత రైతులకు తెలిపారు. దీంతో వారు గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్, టిప్పర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాగా గ్రావెల్ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో రుద్రకోట దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పీ. శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, స్థానిక రైతులు గోపాల్, శ్రీనివాసులు, దాసు, లక్ష్మయ్య, మోహన్‌రావు, రామచంద్రయ్య, సౌభాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మూడు సవర్ల బంగారు గొలుసు స్వాధీనం

నెల్లూరు(క్రైం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కల్యాణ మండపంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్న రాధాకృష్ణ పెద్ద కుమార్తె వివాహం ఈ ఏడాది ఆగస్టు 17వ తేదీన షైపాడు గేటు ప్రాంతంలోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. ఈక్రమంలో వధువు గదిలోని బంగారు గొలుసు, సూట్‌కేస్‌ను గుర్తుతెలియని దుండగలు అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు ప్రగతినగర్‌కు చెందిన పాత నేరస్థుడు బషీర్‌గా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి మూడు సవర్ల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నామని నవాబుపేట పోలీసులు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో పట్టుబడిన గంజాయి ధ్వంసం



జింథాల్ సంస్థకు తరలించి, గంజాయిని ధ్వంసం చేస్తున్న అధికారులు

నెల్లూరు (క్రైం), నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన గంజాయిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేశారు. 64 కేసుల్లో 751 కేజీల 586 గ్రాముల డ్రై గంజాయి, 950 గ్రాముల హాషిష్ ఆయిల్, 4.2 మీటర్లు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని గుంటూరు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామ పరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థకు తరలించి శాస్త్రీయంగా ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు ఎం.శంకరయ్య (డీసీ,నెల్లూరు), పీ దయాసాగర్(ఏసీ), కే విజయ (డీసీ,ఒంగోలు), ఏ శ్రీనివాసులు నాయుడు (డీపీఈవో, నెల్లూరు), జే.రమేష్ (ఏఈఎస్, నెల్లూరు) తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 660



హాకీ టోర్నమెంట్‌లో కందుకూరు విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ అండర్ 14 హాకీ టోర్నమెంట్‌లో కందుకూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచారని హెచ్‌ఎం ఎం నరసింహమూర్తి, పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, మెండా నరసింహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు త్వరలో తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

చల్లాయానాదులం.. చల్లగా చూడండయ్యా!

- ఉన్నచోటే పక్కా ఇళ్లు నిర్మించాలి
- పూరి గుడిసెల్లో జీవనం దుర్భరం
- ఆదుకోవాలంటున్న చల్లాయానాదులు

జలదంకి, నవంబర్21 (ఆంధ్రజ్యోతి): 'సారూ.. మేమూ మనుషులమే... మా బాగోగుల గురించి కాస్త పట్టించుకోండయ్యా' అని వేడుకుంటున్నారు చల్లాయానాదులు. మండల కేంద్రమైన జలదంకి సమీపంలోని దొరువుకట్ట, కాలువగట్టుపై పూరిగుడిసెల్లో వీరు దుర్భరంగా జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామంలో 70కి పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. చేపల వేటపై ఆధారపడి వీరు జీవిస్తున్నారు. సీజన్లో వ్యవసాయ పనులకు వెళతారు. కూలి డబ్బుతో పొట్టనింపుకొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వీరి తలరాతలు ఏమాత్రం మారడం లేదు. తాటాకు గుడిసెల్లో నేటికీ రెండుమూడు జంటలు కాపురాలుంటున్నాయి. కట్టెలపొయ్యిపై ఆరుబయటే వంట. వీరికున్న ఆస్తులు.. ఆధార్, రేషన్ కార్డులే. వర్షా కాలంలో ఆరుబయట వంట చేసు కోలేక ఖాళీ కడుపులతో బతుకు వెళ్లదీస్తున్నారు. గుడిసెలో కట్టెలపొయ్యిపై వంట చేసుకుంటే గుడిసెకు ఎక్కడ నిప్పంటుకుందోననే భయం. కనీసం వీరి నివాసాల వద్ద అంతర్గత మట్టిరోడ్లు కూడా వేయలేదు. కనీసం తలదాచుకునేందుకు పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని వీరు అధికారులు, పాలకులకు విన్నవించుకుంటున్నారు.





ఎన్నికలప్పుడే మా ముఖాలు చూస్తారు

నాకు 60 ఏళ్ళకు పైనే ఉంటాయి. ఇక్కడే పుట్టి పెరిగా ను. బిడ్డలకు పెళ్ళిళ్ల చేశా. మాతో పాటు మా ఇద్దరు కొడుకులు, కూతుళ్ళు ఒకే గుడిసెలో ఉంటున్నామయ్యా. ఎన్నికలప్పుడు మాత్రమే ఆసాములు, ఆఫీసర్లు మా ముఖాలు చూడడానికి వస్తారు. మా బాధలు వాళ్ళకి చెప్పుకుంటే వింటారు. చేస్తామని చెప్పి పోతారంతే. మేమున్న చోటే మాకు స్లాబు ఇండ్లు కట్టిస్తే దాంట్లో తలదాచుకుని పనీబాట చేసుకుని పొట్టబోసుకుంటామయ్యా.

- పొట్లూరి చిన్నమ్మ



మేమున్న చోటే ఇండ్లు కట్టించండయ్యా

అయ్యా.. మాపెద్దోళ్ల కాలం నుండి దొరువుకట్ట కాడే ఉంటున్నాం. ఇక్కడైతే ఆసాముల దగ్గర పనీపాట చేసుకుని పొట్టపోసుకుంటాం. అందుకోసం మాకు ఇక్కడే పక్కాఇండ్లు కట్టించి కాస్త నీడను కల్పించండయ్యా. ఊరికి దూరంగా స్థలాలు ఇస్తే అక్కడ మేము ఎలా బతకాలయ్యా.

- కుందుకూరు చెంచమ్మ

ఈ గుడిసెలోనే మూడు జంటలముంటున్నాం

ఈ చిన్న తాటాకు గుడిసెలో బార్యాభర్తలం, పిల్లలు, మా తలిదండ్రులు, మా అన్నవదినలు, వారి పిల్లలు కలసి మొత్తం 10మంది ఉంటున్నాం. అందరం ఈ గుడిసెలో ఉండాలంటే చాలా ఇరుకుగా ఉంది. వర్షాకాలంలో చాలా ఇబ్బంది. కాళ్ళుముడుచుకుని పడుకోవాలన్నా స్థలం సరిపోవడం లేదు. పక్కా ఇళ్ళు కట్టించి మమ్మల్ని ఆదుకోండయ్యా.

- పొట్లూరు కొండయ్య, సుబాషిణి



న్యూస్ బాక్స్

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇంద్రాణి

కందుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టరు ఇంద్రాణి నియమితులయ్యారు. ఈమేరకు వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా కందుకూరు ఏరియా ఆసుపత్రిలో సేవలందిస్తున్న డాక్టరు ఇంద్రాణి కరోనా సమయంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. కొద్దినెలల క్రితం ఆత్మకూరు ఏరియా ఆసుపత్రికి బదిలీ అయిన ఇంద్రాణి తిరిగి కందుకూరులో నాలుగురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టరు శకుంతల తనను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని చేసిన విజ్ఞప్తితో సూపరింటెండెంట్ బాధ్యతలు ఇంద్రాణికి అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరచుకోవాలి

అల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరచుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు అన్నారు. రామకృష్ణ డిగ్రీ, పీజీ విద్యార్థులు శనివారం నిర్వహించిన ఎన్‌ఎస్ఎస్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని వెలికితీసేందుకు ఎన్‌ఎస్ఎస్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌సింగ్, వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

భవిష్యత్తు సోషలిజానిదే

కావలి (టౌన్)నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు సోషలిజానిదేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం మోహన రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకులు ఎస్ వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోషలిజం - విశిష్టత అనే అంశంపై ఆయన మాట్లాడారు. న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్ట్ మందాని ఎన్నికవడం శుభ పరిణామమన్నారు. కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య, సభ్యులు కృష్ణయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, బాబు పాల్గొన్నారు.

వివరాలను సమగ్రంగా నమోదు చేయాలి : ఎంఈవో



రికార్డులు పరిశీలిస్తున్న ఆనందరావు

కొండాపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర వివరాలను ఆన్‌లైన్లో ఖచ్చితంగా నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని గానుగపెంట మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులతో పాటు ఎస్ ఏ-1 మార్కుల రికార్డులను పరిశీలించారు . ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఏడీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. దగదర్తి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, స్థానికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సిబ్బంది పని తీరుపై డాక్టర్ అఖిలతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో లెప్రసీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. లెప్రసీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కొండారెడ్డి, ఆరోగ్య సిబ్బంది కల్పన, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇంటింట సర్వేలో జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలి

ప్రజా సమస్యల పరిష్కారానికి

చిత్తశుద్ధితో కృషి చేయాలి

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు

లింగసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్ (పిజిఆర్ఎస్) కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి అనేక తప్పిదాలు జరిగాయని, వాటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం మరలా రీసర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే తహసీల్దార్, సబ్ కలెక్టర్ల దృష్టికి తెచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.



లింగసముంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్నఎమ్మెల్యే నాగేశ్వరరావు

సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు

స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు గతంలో దాతలు 7.23 ఎకరాల భూమి దానం చేశారని, దీంతో అందులో హైస్కూల్ నిర్మించారని, అయితే ప్రస్తుతం 5 ఎకరాలు మాత్రమే ఉందని, కొలతలు వేసి మిగిలిన 2.23 ఎకరాలు అప్పగించాలని ప్రధానోపాధ్యాయుడు యు మాధవ రావు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు అర్జీ ఇచ్చారు. అలాగే మరో 109 మంది అర్జీలు ఇవ్వగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్‌వివి బాలసుబ్రహ్మణ్యం, సీఐ మంగారావు, ఎస్సై నారాయణ, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, ఆర్ఐ ఎం రమణయ్య అన్ని శాఖల అధికారులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరలో 24 గంటలు విద్యుత్ సరఫరా

వలేటివారిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో త్వరలో 24 గంటలు విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బడేవారిపాలెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఆర్‌డిఎస్ఎస్ పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో లోఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. మండలంలోని పోకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఇకపై నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కానున్నట్లు తెలిపారు. బడేవారిపాలెం ఫీడర్ పరధిలోని గ్రామాల్లో ఈ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు. ఇప్పటికే ఈ పథకం కింద పోలినేనిచెరువు, చుండి గరుకుపాలెం, వీరన్న పాలెం, కాకర్లపాలెం పెదఅమ్మపాలెం గ్రామాల్లో పనులు పూర్తయినట్లు తెలిపారు. దీంతో గృహావసరాలకే కాకుండా వ్యవసాయ బోర్లకు కూడా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, వీరయ్య, ఏఈ మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డు విస్తరణలో భాగంగా లైన్‌వర్క్ ఉన్నందున శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11కేవీ సీటీఆర్ఐ ఫీడర్, 11కేవీ తహసీల్దార్ కార్యాలయం ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల ప్రజలంతా అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

పచ్చదనంతోనే పచ్చని జీవితాలు

కావలి (టౌన్) నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పచ్చదనంతోనే జీవితాలు పచ్చగా ఉంటాయని జవహర్‌భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. ఎన్‌ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా మూడవ రోజు పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ ప్రాంతంలో ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థి దశనుంచే సామాజిక సేవాధృక్పథం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో జేబీ స్వయం ఉపాధి కోర్సుల సంచాలకుడు ఆర్ మాల్యాద్రి, లైబ్రేరియన్ వెంకట్రావు, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అయూబ్ అహ్మద్, నాగేశ్వరరావు, విశ్రాంత హిందీ అధ్యాపకుడు భాస్కర్‌రావు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.




గిరిజన కాలనీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు

డంపింగ్ యార్డుకు దారి చూపండి!

వలేటవారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో చెత్తసంపద కేంద్రానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గ్రీన్ అంబాసీడర్లు గ్రామంలోని చెత్తను ప్రధాన రహదారి పక్కన వేసి నిప్పుపెడుతున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తసంపద కేంద్రాన్ని ప్రధాన రహదారికి అర కిలో మీటరు దూరంలో లక్షలు వెచ్చించి నిర్మించారు. అయితే రోడ్డు సౌకర్యం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారింది. కాగా, చెత్తను సంపద కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువులు తయారుచేసి విక్రయించగా వచ్చిన ఆదాయంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనే ప్రభుత్వ ఆశయం నీరుగారిపోయింది.

ఉప్పలపాడులో డంపింగ్‌యార్డుకు వెళ్లే దారి ఇదే..!



చెత్త రహిత గ్రామాలే లక్ష్యం

- డీఎల్‌పీవో కృష్ణమోహన్
- పచ్చదనం - పరిశుభ్రతపై పోలినేనిపాళెంలో శిక్షణ

వలేటివారిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని కందుకూరు డీఎల్‌పీవో కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో శుక్రవారం పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరితరాయబారులు గ్రామంలోని చెత్తను సంపద కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రానికి తరలించిన చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి సేంద్రియ ఎరువులను తయారుచేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించి, వచ్చిన ఆదాయంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రీన్ అంబాసీడర్లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, సర్పంచ్ అనుమోల అమరేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోలినేనిపాళెంలో గ్రీన్ అంబాసీడర్లను సన్మానిస్తున్న డీఎల్‌పీవో కృష్ణమోహన్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కావలి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలం చలంచర్ల గ్రామ పంచాయతీలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లకు స్థానిక సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి థీమ్-5, క్లీన్ విలేజ్ - గ్రీన్ విలేజ్‌పై శిక్షణ ఇచ్చారు. తడిచెత్త, పొడి చెత్తలను వేరువేరుగా అందించాలని సూచించారు. చెత్తసేకరణ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, సీఆర్పీ లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బిట్రగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్ర మం నిర్వహించారు. బోగోలు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం, అరుంధతివాడ, కప్పరాళతిప్ప, చెంచులక్ష్మీపురం గ్రామాల్లో చెత్తను తొలగించారు. చెంచులక్ష్మీపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన స్థానికులు చెత్త వేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులకు ఎంపీడీవో స్పందించారు. ఇష్టానుసారంగా రోడ్లపై చెత్త వేస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ప్రజ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ విస్తరణాధికారి వేణుగోపాల్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



బిట్రగుంట : చెత్త తొలగింపజేస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం



కొద్దిపాటి వర్షానికే బురదమయం

కావలి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొద్దిపాటి వర్షానికే శివారు ప్రాంతంలోని రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికే టీకేనగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, టీచర్స్ కాలనీ, వైకుంఠపురం, గాయిత్రీనగర్ తదితర ప్రాంతాలన్నీ బురదమయమయ్యాయి. కనీసం కచ్చా (మట్టి) రోడ్డు కూడా లేకపోవడంతో వాన నీరు వెళ్లేందుకు మార్గంలేక గుంతల్లోనే నీరు నిల్వ ఉంటోంది. కాలువలు లేనందున నివాసాల ముందు బురదగా మారి రాక పోకలకు ఇబ్బందికరంగా మారిందని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు. తమ కాలనీల్లో కనీస వసతులు లేవని, అధికారులు, పాలకులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

కావలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విపత్తు నిర్వహణపై శుక్రవారం స్థానిక పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ సుందరరాజు ప్రమాదాలలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స, ఆసుపత్రికి సురక్షితంగా తరలించటంపై అవగాహన కల్పించారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుడు, జూనియర్ రెడ్‌క్రాస్ సలహాదారుడు బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేరి సేవ, ఆరోగ్యం, అంతర్జాతీయ స్నేహంపై శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు, విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్, పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ కేబీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జూనియర్ రెడ్‌క్రాస్ బాధ్యులు





ధ్వంసం చేసిన జాతీయ రహదారి డ్రెయిన్

హైవేపై డ్రైనేజీల ధ్వంసం

కలిగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహ దారి 167బీజీ విస్తరణలో భాగంగా గత 20 రోజుల నుండి పట్టణంలో రహదారి వెంబడి డ్రెయిన్‌ల నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం రోడ్డు పనులను పరిశీలించారు. కొలతల్లో తేడాలు ఉండటం గుర్తించి, పనులు సరిగా చేయాలని లేకపోతే ఆపివేయా లంటూ అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా రోడ్డు పనులు జరగడంతో, పలువురు నాయకులు అర్ధరాత్రి జేసీబీ యంత్రా లతో డ్రైనేజీ కాలువలను పగులగొట్టించారు. శుక్రవారం ఉదయం హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోని బేకరీ వద్ద పాత సిమెంటు రోడ్డుకు నిర్మించి న డ్రెయిన్ పగులకొట్టడం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విష యమై ఎన్‌హెచ్ డీఈ నాగిరెడ్డిని వివరణ కోరగా, రాత్రివేళల్లో అక్రమంగా డ్రెయిన్‌లను ధ్వంసం చేసినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాం ట్రాక్టరుకు సూచించామన్నారు. జిల్లా కలెక్టర్ సూచనలమేరకు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తామని డీఈ తెలిపారు.

ట్రావెల్స్ బస్సుల తనిఖీ

నెల్లూరు(క్రైం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ప్రమాదాల దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు గురువారం రాత్రి నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. బస్సుల పత్రాలను పరిశీలించి, డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పక్కనపెట్టి: ఆలయం నుంచి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి.. రాంభగీచ సర్కిల్ వద్దకు నిలుచుని ఉన్న భక్తులను గమనించారు. ప్రొటోకాల్ పక్కన పెట్టి వాహనాన్ని రోడ్డుపైనే ఆపి భక్తుల వద్దకు వెళ్లి పలకరించారు. హెచ్‌వీసీ కాంప్లెక్స్ వరకు నడుచుకుంటూ వెళ్లి భక్తులకు అభివాదం చేశారు. కొందరు పిల్లలకు చాక్లెట్లు పంచారు. అనంతరం గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమె.. కాసేపు విశ్రాంతి తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

ప్రశాంతంగా రాష్ట్రపతి పర్యటన



రాష్ట్రపతి రాకతో నిర్మానుష్యంగా శ్రీవారి ఆలయ పరిసరాలు



లేపాక్షి సర్కిల్ వద్ద వేచిఉన్న భక్తులు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్న ఆమె.. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ్నుంచి వరాహస్వామి ఆలయానికి వెళ్లేందుకు టీటీడీ బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేసింది. చిరు జల్లుల కురుస్తున్నా.. రాష్ట్రపతి కాలినడకనే వెళ్లి వరాహస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి రాష్ట్రపతితోనే రాగా.. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అర్చకబృందంతో కలిసి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవిరాట్టును దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. చైర్మన్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి, చైర్మన్, ఈవో, అదనపు ఈవోతో పాటు బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, జానకీదేవి, పనబాక లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులున్నారు. సంప్రదాయాన్ని పాటిస్తూ రాష్ట్రపతి వ్యక్తిగత భద్రతాసిబ్బంది పంచె, షర్టుతో ఆలయ ప్రవేశం చేశారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా అక్కడక్కడ వాహనాలను ఆపేయడంతో భక్తులు స్వల్పంగా ఇబ్బంది పడ్డారు. ద్రౌపది ముర్ము దర్శన సమయంలో ఆలయం వద్దకు ఎవరినీ అనుమతించలేదు.



ద్రౌపది ముర్మును పలకరిస్తున్న శ్రీవారి ఆలయ పెద్ద, చిన్నజీయర్ స్వాములు



శ్రీవారి ఆలయం ముందు రాష్ట్రపతి

రాష్ట్రపతికి సాదర వీడ్కోలు



రేణిగుంట, ఆంధ్రజ్యోతి: తిరుమల నుంచి శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఆమెకు సాదర వీడ్కోలు పలికారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

→ విమానాశ్రయంలో రాష్ట్రపతికి మెమెంటో ఇస్తున్న మంత్రి అనిత



శ్రీవారి ఆలయంలో రాష్ట్రపతితో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

పోలీసు నిఘాలో తిరుపతి

- మావోయిస్టులు తలదాచుకునే అవకాశాలున్నాయని అనుమానం
- కొత్త మనుషులు కనిపిస్తే ప్రశ్నలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రతా బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పడుతుండడంతో మావోయిస్టులు ఏపీలోని నగరాలను అజ్ఞాత ఆవాసాలుగా మార్చుకుంటున్నారనే సమాచారంతో తిరుపతి మీద కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెంచారు. కానూరు న్యూ ఆటోనగర్‌లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన తర్వాత తిరుపతి ఆటోనగర్, తారకరామనగర్ వంటి ప్రాంతాల మీద దృష్టి పెట్టారు. అలిపిరిలో చంద్రబాబుపై దాడి సమయంలో నక్సల్స్ తిరుపతిలోనే కొంతకాలం పాటు ఉన్నట్టు ఆ తర్వాత వెల్లడైన సంగతి తెలిసిందే. దీంతో దేశం నలుమూలల నుంచి వేలాది మంది రోజూ వచ్చిపోయే తిరుపతిని మావోయిస్టులు సురక్షిత ప్రాంతంగా భావించే అవకాశం ఉండడంతో కొత్త వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నారు. యూపీ, బిహార్ వంటి ప్రాంతాల నుంచి భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, రోడ్ల పనివారు పెద్ద సంఖ్యలో తిరుపతిలో ఉంటున్నారు. జీవకోన, మంగళం, తారకరామనగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో పోలీసులు నిరంతర నిఘా ఉంచారు. అనుమానస్పదంగా కనిపిస్తే ప్రశ్నిస్తున్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్లు కూడా రంగంలోకి దిగినట్టు తెలిసింది. కొత్త వ్యక్తులు తారసపడితే, వారి వివరాలన్నీ సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు ద్వారా నిర్ధారించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈక్రమంలో ఆధార్ కానీ, ఓటరు కార్డు కానీ లేకుండా చాలా మంది ఉన్నట్టు గుర్తించారు. ఎవరైనా అనుమానాస్పద రీతిలో కనిపిస్తే 112 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని స్థానికులను పోలీసులు కోరుతున్నారు.

0877- 2236007

- తుఫాను హెచ్చరికతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ అవకాశాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు తుపాను హెచ్చరిక రావడంతో కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. ప్రజలకు ఏవైనా అవసరముంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను 0877-2236007లో సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుతో పేలిన మొబైల్

- వరినాట్లు వేస్తున్న యువకుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పొలంలో వరినాట్లు వేసే క్రమంలో పిడుగుపాటుతో జేబులో ఉన్న మొబైల్‌ఫోన్ పేలడంతో నరసింహారెడ్డి(36) తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన ఈయన ఇంటి సమీపంలోని పొలంలో శుక్రవారం సాయంత్రం వరి నాట్లు వేస్తున్నారు.ఈ క్రమంలో పిడుగుపాటుకు అతడి జేబులోని సెల్‌ఫోను పేలింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరుకు తీసుకెళ్లారు.

'మాక్ అసెంబ్లీ'కి విద్యార్థుల ఎంపిక



మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో డీఈఓ కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 26న జరగనున్న జిల్లాస్థాయి మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి నియోజకవర్గాల వారీగా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపికచేశారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి అల్లూరి చిన్నమయి, గూడూరు నుంచి పి.సాగర్‌కుమారి, సత్యవేడు నుంచి అంశుమేరి, శ్రీకాళహస్తి నుంచి మహిజ, సూళ్లూరుపేట నుంచి కావలి పల్లవి, తిరుపతి నుంచి బొబ్బిలి భవ్యశ్రీ, వెంకటగిరి నుంచి మేఘన ఎంపికయ్యారు. అలాగే సబ్‌స్టిట్యూట్‌గా కె.వెంకట దినకర్ ఎంపికయ్యారు. వీరిని డీఈవో కేవీఎన్ కుమార్, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ అభినందించారు. వీరికి అసెంబ్లీ విధివిధానాలపై ప్రత్యేక శిక్షణనిచ్చినట్టు తెలిపారు.

గజలక్ష్మీ నమోస్తుతే

- జనసంద్రమైన తిరుచానూరు
- ఉదయం పల్లకీపై మోహినిగా ఊరేగిన అమ్మవారు





శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు గరుడ సేవకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో.. అమ్మవారి ఉత్సవాల్లోనూ ఐదో రోజు గజ వాహనసేవకు అంతటి ప్రాధాన్యం ఉంది. తిరుమల శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని ధరించి.. శుక్రవారం రాత్రి మహాలక్ష్మిగా పద్మావతి అమ్మవారు తన ప్రీతిపాత్రమైన గజ వాహనంపై ఊరేగారు. అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులతో తిరుచానూరు జనసంద్రంగా మారింది. కీలుగుర్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, జీయర్ల పరివారం ప్రబంధ పారాయణం చేస్తుండగా గజవాహన సేవ ముందుకు సాగింది. అమ్మవారికి హారతులిచ్చేందుకు భక్తులు పోటీపడ్డారు. తరలివచ్చిన భక్తజనంతో మాడవీధులు రద్దీగా మారాయి. పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అప్రమత్తమై పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం.. మోహినీ రూపంలో పల్లకిలో వయ్యారంగా కూర్చున్న అమ్మవారు.. తన సుందర మనోహర సౌందర్యాన్ని ఎదురుగా ఉన్న దర్పణంలో చూసుకుని మురిసిపోతున్నట్లు కదులుతూ పరవశింపచేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిరుజల్లుల మధ్య పల్లకీ వాహనసేవ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర యెల్లా, సాంబశివరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వసంతోత్సవం జరిగింది.



బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలు: సర్వభూపాల వాహనం
సాయంత్రం 4.20 గంటలు: స్వర్ణరథోత్సవం
రాత్రి 7 గంటలు: గరుడవాహనం



కుప్పం ప్రజలకు రుణపడి ఉంటా!

- నారా భువనేశ్వరి



ఆధార్ కార్డు లేకపోవడంతో ఆర్టీసీ బస్సులో టికెట్టు తీసుకుంటున్న భువనేశ్వరి

కుప్పం/శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయకత్వం మీద మీకున్న గురి ఎప్పుడూ నన్ను అబ్బురపరుస్తుంది. 8 సార్లు ఆయనను మీరు ఇక్కడినుంచి గెలిపించారు.ఇందుకు జీవితాం తం కుప్పం ప్రజలకు రుణపడి ఉంటా'.....ముఖ్యమంత్రి చంద్ర బాబు సతీమణి, ఎన్టీఆర్ మెమో రియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ ప్రజలనుద్దేశించి అన్న మాటలివి. కుప్పం నియోజకవర్గ పర్యటనలో మూడవ రోజైన శుక్రవారం ఆమె శాంతిపురం, రామకుప్పం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా శాంతిపురం మండలం నడింపల్లెలో మహిళలతో జరిగిన ముఖాముఖిలో భువనేశ్వరి సంభాషిస్తూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందాయా అంటూ ఆరా తీశారు.హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పం తీసుకురావడంతో కరువు సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడంవల్లే తాను ఆయన బదులుగా తరచూ కుప్పం వచ్చి ఇక్కడి ప్రజల సాదకబాధకాలు తెలుసుకుంటున్నానన్నారు. ఎటువంటి సమస్యనైనా చంద్రబాబుతో చెప్పి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా కూడా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే ఎన్నో రకాల వృత్తులు, పనుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అలీప్ సంస్థను తీసుకు వచ్చారన్నారు. మహిళలందరూ ఈ ప్రాజెక్టులో చేరి వారిచ్చే శిక్షణలో పాల్గొని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌలభ్యాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో పైకి ఎదగడానికి వినియోగించుకోవాలని సూచించారు.కాగా శాంతిపురం మండలంలో తుమ్మిశి పెద్ద చెరువు, రామకుప్పం మండలం విజలాపురం చెరువుల వద్ద కృష్ణా జలాలకు భువనేశ్వరి హారతి ఇచ్చారు. అంతకుముందు శాంతిపురం మండలం కడపల్లెనుంచి తుమ్మిశి పెద్ద చెరువు దాకా ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించి స్త్రీ శక్తి పథకం ద్వారా వారు పొందిన లబ్ధిని గురించి వారినే అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం నుంచి కనమనపల్లె దాకా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ.7 కోట్ల దోపిడీ కేసులో గుడిపాలవాసి

చిత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రూ.7 కోట్లను ఏటీఎంలలో నింపేందుకు తీసుకెళ్తుండగా దోపిడీ చేసిన ముఠాలో చిత్తూరుజిల్లా గుడిపాల మండలం చిత్తపారకు చెందిన రవి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి ఇతడి తండ్రి మాజీ ఆర్మీ ఉద్యోగి రామదాసును అరెస్టు చేసి బెంగళూరుకు తీసుకెళ్లారు. శుక్రవారమూ గుడిపాలలో పోలీసుల గాలింపు కొనసాగింది.

కనువిందుగా వసంతోత్సవం



అమ్మవారు ఊరేగుతుంటే.. అర్చకులు, అధికారులు వసంతాన్ని చల్లుతుంటే.. భక్తుల గోవింద నామస్మరణలతో తిరుచానూరు ఆలయ తిరుమాడవీధులు ప్రతిధ్వనించాయి. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారిని స్వర్ణకమల తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లూతూ వసంతోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. జోరు వర్షంలోను అమ్మవారి వాహన సేవ జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సహస్ర లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసులహారం శుక్రవారం పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరింది. గజవాహన సేవలో ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మీకాసుల హారాన్ని అలిపిరికి తీసుకొచ్చారు. అక్కడ్నుంచి శోభాయాత్రగా జేఈవో వీరబ్రహ్మం, ఇతర అధికారులతో కలిసి మండపానికి తీసుకొచ్చారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆ కాసుల హారాన్ని అర్చకులకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ అమ్మవారి ఆలాయానికి హారాన్ని తీసుకొచ్చి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజ వాహనసేవలో ఉత్సవమూర్తికి ఈ సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని ధరింపచేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శోభాయాత్రలో పాల్గొన్న టీటీడీ ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు



అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకీ సేవ, రాత్రి గజవాహన సేవ ముందు కళాకారుల నృత్య సంబరం అమోఘంగా సాగింది. వివిధ రాష్ట్రాల కళాకారులు మాడవీధుల్లో ప్రదర్శించిన నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. తీన్‌మార్ డ్రమ్స్, రింగ్ ఫిజన్, ట్రైబల్ డ్యాన్స్, కోలాటాల ప్రదర్శనలు భక్తులు ఆకర్షించాయి.ఉదయం నూజివీడుకు చెందిన అమరావతి డ్రమ్స్ రాంబాబు బృందం తీన్‌మార్ డ్రమ్స్.. తణుకుకు చెందిన అంబిక డ్యాన్స్ అకాడమీకి చెందిన 20మంది కళాకారుల రింగ్ ఫ్యూజన్ నృత్యం, నూజివీడు లాలేశ్వరరావు బృందం చెక్క భజనలు, కొవ్వూరుకు చెందిన శివరామకృష్ణ బృందం ట్రైబల్ డ్యాన్స్ భక్తులను కనువిందు చేశాయి. తిరుపతికి చెందిన హరిత బృందం పలు దేవతా మూర్తులు, డాక్టర్ మురళీకృష్ణ బృందం నవదుర్గలు, అష్టలక్ష్మి వేషధారణ భక్తులను మైమరిపించాయి. చిత్తూరుకు చెందిన వాణిశ్రీ బృందం, పొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి బృందం, రైల్వే కోడూరుకు చెందిన నసుజన కోలాటాలు అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



నృత్య సంబరం.. అమోఘం











శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.61 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,839

తలనీలాలు సమర్పించినవారు: 19,220

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా



బస్సును పక్కకు తొలగిస్తున్న క్రేన్

- ఆరుగురికి గాయాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విజయవాడ నుంచి 21 మంది ప్రయాణికులతో బెంగళూరుకు వెళ్తున్న బస్సు దొడ్లవారిమిట్ట వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురానికి చెందిన శ్రీనివాసులు, ఏలూరుకు చెందిన శ్రీనివాసులు, గుంటూరుకు చెందిన తోరటి మల్లీశ్వరి, ఎం.అంజమ్మ, షణ్ముగనాథ్, ఈశ్వర్‌రావు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలిగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన జర్నలిస్ట్ శ్రీనివాసులు
- విచారణ నేటికి వాయిదా

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీ వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు కోరుతూ పిటిషన్ వేసిన తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ అభ్యర్థనపై అభిప్రాయాన్ని చెప్పాలని సీఐడీని ఆదేశించింది. వ్యాజ్యం పై తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.పరకామణి చోరీ వ్యవహారం సీఐడీ విచారణకు ఆదేశించాలని పిటిషనర్‌కు బెదిరింపులు వస్తున్నాయని, భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల 15న వినతి సమర్పించినా పోలీసుల నుండి ఎలాంటి స్పందన లేదని జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ముగిసేవరకు భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

పోటెత్తిన భక్తులు

- సాయంత్రానికే గ్యాలరీల్లో నిండిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం రాత్రి జరిగిన పద్మావతి అమ్మవారి గజ వాహన సేవకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6.45 గంటలకే భక్తులతో గ్యాలరీలు నిండిపోయాయి. మాడవీధుల్లో భక్తులు కిక్కిరిసి ఉన్నారు వెలుపల ప్రధాన మార్గం వరకు భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ఇక, గేట్ నెంబర్ 2ను సాయంత్రం 6.30గంటలకు మూసేయడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎమ్మెల్యేపులివర్తి నాని హారతి పాయింట్ ఉన్న ప్రతిగేట్ వద్ద విజిలెన్సు సిబ్బందికి తొక్కిసలాటలు లేకుండా సూచనలు సలహాలు ఇచ్చారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో స్థానికులు రావడంతో కాస్త తోపులాట జరిగింది. రాత్రి 10.20 గంటలకు అమ్మవారి గజ వాహనం.. గంగుండ్ర మండపం వద్దకు చేరింది. చిన్న చిన్న ఘటనలు మినహా వాహన సేవ ప్రశాంతంగా ముగిసింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషి, ఎస్పీ తదితరులు

పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు

తిరుచానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన 25వ తేది జరిగే పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషీ, ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పంచమి తీర్థం ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం, పుష్కరణి పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. స్నానాలు చేసే భక్తుల భద్రత దృష్ట్యా పుష్కరిణిలో లైఫ్‌గార్డులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసు డైవర్స్, విజిలెన్సు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు వెంకట నారాయణ, ప్రసాద్, గిరిధర్, టీటీడీ విజిలెన్సు అధికారులు పాల్గొన్నారు.

కారు కనిపిస్తే రాళ్లేస్తాడు

- తిరుపతిలో మానసిక రోగి విధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడికి మానసిక స్థితి సరిగాలేదు. కార్లు కనిపిస్తే చాలు.. వాటిపై రాళ్లు వేసి ధ్వంసం చేస్తున్నాడు. గతంలో కారు ఘటన ఏదో ఇతడిని కలవరానికి గురిచేయడమే కారణమని అలిపిరి పోలీసులు అంటున్నారు. ఇలా దాడికి పాల్పడే వ్యక్తిది తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి. తల్లిదండ్రులతో కలిసి మంగళంలో ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో ఫుల్లుగా మద్యం తాగి.. తిరుపతి నగరం మధురానగర్‌లోకి వచ్చాడు. ఓ ఇంటి ముందు ఆపి ఉన్న కారుపై బండరాళ్లు వేసి ధ్వంసం చేశాడు. ఆ తర్వాత దుకాణాలపైన రాళ్లు విసిరాడు. దీంతో ఐదారు దుకాణాల తలుపులు, షట్టర్లు దెబ్బతిన్నాయి. ఈ రాళ్ల దాడిలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. ఈ విధ్వంసాన్ని గమనించిన సీపీఎం నేత కందారపు మురళి అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. అలిపిరి ఎస్ఐ అజిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మానసిక రోగి కావడంతో విచారించి అతడి తల్లితండ్రులకు అప్పగించామని పోలీసులు చెప్పారు.

తరచూ ఇలాంటి ఘటనలే

ఈ మానసిక రోగే అని కాదు.. మధురానగర్‌లో పలుమార్లు తాగుబోతులు కూడా ఇలాంటి విధ్వంసాలకే పాల్పడ్డారు. ఆరు నెలల కిందట ఇక్కడ నివాసమున్న ఇద్దరు ఫొటో జర్నలిస్టుల ద్విచక్ర వాహనాలను అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని మందుబాబులు బండ రాళ్లతో ధ్వంసం చేశారు. వినాయక ఆలయం వద్దనున్న రెండు మున్సిపల్ కాంప్లెక్సుల వద్ద రాత్రి 10 గంటలైతే చాలు కొందరు బహిరంగంగా మద్యం తాగుతూ దారిన పోయేవాళ్లను వ్యంగ్యంగా మాట్లాడుతున్నట్లు స్థానికులు చెప్పారు. దీంతో ఆ దారిన వెళ్లాలంటే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం)/భాకరాపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఏడాది జైలు శిక్ష, రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మైలావాండ్లపల్లెకి చెందిన వి.శ్రీనివాసులు, వి.జయచంద్ర శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి.. దుంగలను డంపింగ్ ప్రాంతాలకు చేర్చేవారు. ఆ తర్వాత వాటిని తమిళనాడులోని స్మగ్లర్లకు అమ్మేవారు. ఈ క్రమంలో 2014లో వీరు ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారనే సమాచారంతో అప్పటి భాకరాపేట ఎస్ఐ నెట్టికంఠయ్య, సిబ్బంది కలసి దాడులు చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై పలు దఫాలుగా కేసు విచారణ జరిగింది. అనంతరం తిరుపతి ఎర్రచందనం కోర్టుకు కేసును బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, స్మగ్లర్లకు శిక్ష పడడానికి కృషి చేసిన చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ, ప్రస్తుత సీఐ ఇమ్రాన్ బాషా, ఎస్ఐ రాఘవేంద్ర, అప్పటి ఎస్ఐ నెట్టికంఠయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్, కోర్టు కానిస్టేబుల్ నరసింహులును టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీవారి సేవలో హోం మంత్రి అనిత



తిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సోషల్ మీడియాలో ఇళయరాజా ఫొటో వాడొద్దు

- మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత స్వరకర్త 'ఇసైజ్ఞాని' ఇళయరాజా ఫొటోను సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి నెట్‌వర్కింగ్ సైట్లలో ఉపయోగించడంపై మద్రాస్ హైకోర్టు తాత్కాలిక నిషేదం విధించింది. ఈ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో తన అనుమతి లేకుండా తన ఫొటోను ఉపయోగించడాన్ని నిషేధించాలని కోరుతూ ఇళయరాజా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీ సాయంతో తన ఫొటోను మార్ఫింగ్ చేసి వాణిజ్యపరంగా వినియోగిస్తూ ఆదాయాన్ని అర్జిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత హక్కులను హరించే చర్య అని పేర్కొన్న ఇళయయరాజా..ఇకపై తన అనుమతి లేకుండా ఎవ్వరూ ఉపయోగించకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఇళయరాజా ఫొటోలను ఆయన అనుమతి లేకుండా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లలో తాత్కాలికంగా ఉపయోగించరాదని స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం: శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మన శ్రీధర్

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలుస్తోందని మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ అన్నారు. శుక్రవారం మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు వలలు, సైకిళ్లు, రాయితీపై డీజిల్ అందించగా, వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకుందన్నారు. మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు బొమ్మన పళణి, కోడిపర్తి శ్రీధర్, పులికాట్ మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకులు సుధాకర్, సుందరమూర్తి, ఏకాంబరం, స్వామియార్, దేశప్పన్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గురుకులం విద్యార్థులు



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గురుకులం ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, పీడీ శిరేష్, ఉపాధ్యాయులు

చిల్లకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఈనెల 23,24,25 తేదీల్లో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఆనందరావు, పీడీ శిరేష్, పీఈటీ రాజేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నాయుడుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌ఏ సాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన వారికి నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ మోహన్, సుబ్రహ్మణ్యం, సుభాష్, చంద్ర, జి.వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, అమృతవల్లి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలు



స్వర్ణముఖినది వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వర్ణముఖినది వద్దకు చేరుకుని స్నానాలు ఆచరించి పూజలు చేశారు. అనంతరం నదిలో పిండి దీపాలు వెలిగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాలాయపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. సెన్‌యార్ తుఫాన్ ప్రభావంతో 21నుంచి 24వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే కంట్రోల్ రూం నంబరు 9492099404కు ఫోన్ చేయాలని సూచించారు.

చెత్త నిర్వహణపై కార్మికులకు శిక్షణ

బాలాయపల్లి, నవంబరు 21(నవంబరు): పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సంపద తయారీ కేంద్రాల్లో కార్మికులకు ఎంపీడీవో నారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మినీ గురుకులంలో శుక్రవారం శ్రీకృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థునులకు కంటి, దంత పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించగలరని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి, రాజశేఖర్, లావణ్య, నాగూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ అనుబంధ సంఘాల ఎంపిక

ఓజిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ అనుబంధ సంఘాల ఎంపిక కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనరు విజయకుమార్ తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. మండలంలోని కొండూరు పంచాయతీలో శుక్రవారం పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదనరెడ్డి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. తడ, వేనాడు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. గ్రంథాలయ కార్యదర్శి కల్యాణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో

లారీ డ్రైవర్ ఆత్మహత్య

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో లారీ డ్రైవర్‌గా ఆత్మహత్య పాల్పడ్డాడు. తమిళనాడు విల్లాపురానికి చెందిన చంద్రశేఖరన్(46) తడ మండల పరిధిలోని పూడి గ్రామం వద్ద ఉన్న ఒక స్క్రాప్ యార్డ్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో అక్కడే పనిచేసే మరో డ్రైవర్‌కు ఫోన్‌చేసి కుటుంబ కలహాల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా చెప్పాడు. ఆ డ్రైవర్ వెంటనే చంద్రశేఖరన్ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. కుటుంబసభ్యులు గాలించినా కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డంపింగ్ యార్డ్ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు విన్నవించే సమస్యలను సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అందజేసే అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మన జిల్లాలో గూడూరులో మొట్టమొదటిగా ఈ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆన్‌లైన్ ద్వారా సీఎం డాష్‌బోర్డుకు పంపడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రెవెన్యూశాఖకు సంబంధించి ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమణలకు గురి చేస్తున్నారని, ఇటువంటివి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రావు, తహసీల్దారు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: కురుగొండ్ల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి వినతినీ పరిష్కరించే వరకు తాను పర్యవేక్షిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, తహసీల్దారు నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు, టీడీపీ నాయకలు పాల్గొన్నారు.

నగర వనం పనులను త్వరగా పూర్తి చేయండి



నగర వనాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సాయిబాబా

వెంకటగిరి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో అసంపూర్తిగా ఉన్న నగర వనం పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) సాయిబాబా ఆదేశించారు. శుక్రవారం ఆయన నగర వనాన్ని పరిశీలించారు. కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా ప్రకృతిని ప్రతిబింబించేలా నగర వనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని, ఆడిటోరియంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. వాష్‌రూంలను ముఖద్వారాల్లో కాకుండా దూరంగా ఏర్పాటు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కలు నాటకుండానే బిల్లులు మంజూరు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో మళ్లీ నగర వనాన్ని సందర్శిస్తానని, అప్పట్లోగా పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్, రేంజర్ రమణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ జీవనోపాధి కల్పనే క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శుభ్రత, హరిత, సుపరిపాలన, అభివృద్ధితో పాటు అందరికీ జీవనోపాధులు కల్పించడమే క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ లక్ష్యమని ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. ఓజిలి మండలం కురుగొండలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం పచ్చదనంతో పాటు మెరుగైన జీవనోపాధులు, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం వంటి అంశాలను వివరించారు. అనంతరం సంపద యారీ కేంద్రం వద్ద ప్రత్యేక సమావేశం, వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రేణుక, సొసైటీ అధ్యక్షుడు దారా అంకయ్య, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి కావ్య, సీహెచ్‌వో సుబ్బరామయ్య, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి

బీరువా వితరణ



ఆలయానికి బీరువాను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చిల్లకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చిల్లకూరులోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముత్తురాజు దాతృత్వంతో బీరువా వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయంలోని స్వామివారి వస్త్రాలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి భద్రపరుచుకునేందుకు బీరువా అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అక్కన రమణయ్య, రవిచంద్ర, వీరేంద్రనాథ్, శ్రీనివాసులురెడ్డి, శివయ్య, రూపేష్, రామ్మోహన్‌రావు, మదనమేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ అప్రమత్తతపై సమీక్ష

డక్కిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో తుఫాన్ ముప్పు పొంచి ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తహసీల్దారు శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం అయ్యారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఎలాంటి సమస్య ఉన్నా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఇప్పటికే చెరువులు నిండిపోవడంతో రైతులను అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా లైన్‌మ్యాన్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. తుఫాన్ ప్రభావంతో శనివారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయట ప్రాంతాలకు వెళ్లరాదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు కురిసి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 9989502068, 9701227914 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు జయ జయరావు కోరారు. మండలంలోని గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రతీరంలో మూడు రోజులపాటు చేపల వేట నిషేధించారు.

బాలల హక్కులపై అవగాహన

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, చెందోడు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది నగ్మ, సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో బాలికలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

27, 28 తేదీల్లో సీపీఐ శిక్షణ తరగతులు

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ శ్రేణులకు ఈనెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్న పెంచలయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పల్లెపాటి బాలకృష్ణయ్య, డక్కిలి శివకుమార్, కచేపల్లి అంకయ్య, పైడిగుండ్ల మునికృష్ణారెడ్డి, అరవ సాయి, ఎం మునీంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఆధార్ సేవలను

సద్వినియోగం చేసుకోండి

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అక్కంపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సోమవారం వేనాడు, మంగళవారం బీవీపాళెం పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులు ఆధార్‌లో తప్పొప్పులను సరిచేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయనవెంట విద్యాశాఖ సిబ్బంది గోపీనాథ్, బాలాజీ ఉన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పేపళ్ల అమరయ్య నాయుడు దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, రాము, రాంబాబు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


కూరగాయల సాగుకు ప్రోత్సాహం

వెంకటగిరి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి ఆనంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయల సాగుకు ప్రోత్సహించేందుకు ఆర్‌కేవీవై పథకం కింద పందిరి నిర్మాణానికి ఎకరాకు రూ.లక్ష రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

సముద్రం అల్లకల్లోలం

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూపిలిపాళెం సముద్రతీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మండల కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. వీఆర్వోలతో పాటు, ఇతర సిబ్బందిని విధుల్లో ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 08624-221024 నెంబరును సంప్రదించాలన్నారు.

సీనియర్ పాత్రికేయుడు శీనారెడ్డి మృతి



శ్రీనివాసులురెడ్డి (ఫైల్‌ఫొటో)

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి అలియాస్ శీనారెడ్డి(57) శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దే వైద్య సంరక్షణలో ఉంటున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో కన్నుమూశారు. శ్రీనివాసులురెడ్డి సుమారు నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో ఉంటూ వివిధ దినపత్రికల్లో పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఇంటి రుచులతో భోజనం అందించండి

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇంటి రుచులతో ఆరోగ్యకరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని నదీతీర పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సరిగా లేదని, ప్రశ్నించిన పిల్లలను, ఉపాధ్యాయులను నిర్వాహకురాలు దూషిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు కోడి గుడ్డు పెంకులతో నిండి దుర్గంధం వస్తుండడాన్ని గుర్తించిన ఆయన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలి తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. చాలీచాలకుండా అన్నం పెడుతోందని, అడిగితే అసభ్యంగా తిడుతోందని, కోడిగుడ్లు నీచు వాసన వస్తున్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని ఇన్ని రోజులు తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ ఎంఈవో బాబయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవోతో ఫోన్‌లో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అప్పటికప్పుడు మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు లీలావతిని తొలగించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి భోజనం తెప్పించేందుకు ఎంఈవో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, నాయకులు బీరం రాజేశ్వరావు, శివారెడ్డి, మంకు ఆనంద్ తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేదు

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో యూరియా కొరత ఉందంటూ అసత్య ప్రచారం జరుగుతోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఖండించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత రానివ్వమని, రైతులు నిర్భయంగా వ్యవసాయ పనులు కొనసాగించాలంటూ కోరారు.

పేదలకు వరం అన్న క్యాంటీన్

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అన్న క్యాంటీన్ వరం లాంటిదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు. భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి రుచి గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఎంఎస్‌బీవై బీమా చెక్కు అందజేత



లక్ష్మీకి బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు చీఫ్ మేనేజర్ కరుణానిధి, ఏపీఎం ప్రసన్న తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పేదలకు వరం లాంటిదని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ కరుణానిధి అన్నారు మండల పరిధిలోని కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన వేలూరు యుగంధర్ ఇటీవల మరణించాడు. ఆయనకు కెనరా బ్యాంకులో ఉండడంతో పీఎంఎస్‌బీవై బీమా చేపుకున్నారు. దీంతో ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకం కింద రూ.2 లక్షల మంజూరైంది. శుక్రవారం మృతుడి భార్య లక్ష్మీకి బీమా చెక్కును చీఫ్ మేనేజర్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకులో ఖాతా ఉన్న వారం దరూ రూ.20 ప్రీమియం చెల్లిస్తే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శివ ప్రసాద్, వెలుగు ఏపీఎం ప్రసన్న, సీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్క రించుకొని శుక్రవారం తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్ పూజలు చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. మత్స్యకారులను సన్మానించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు ఆర్‌కేటీ మహేంద్ర, పామాంజి గోవింద్, కాకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీవో ప్రమీలారాణి, సిబ్బంది

పెళ్లకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో ప్రమీలారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఉన్న సంపద తయారీ కేంద్రంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భూషన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పచ్చదనం.. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలను పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం గ్రామాల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.